ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

గురువారం 5 జూన్ 2025



గాడిన పడిన వ్యవసాయ రంగం

- ఆర్టీసీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ
- గుడివాడలో మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారం

6





ఆవిష్కరణకు సిద్ధంగా గేట్ వే ఆఫ్ అమరావతి స్థూపం



ఆకట్టుకుంటున్న ముఖ ద్వారాలు

- నాలుగు రోజుల పాటు మన ఊరు- మన పండుగ నినాదంతో నిర్వహణ
- జాతీయ స్థాయిలో వాటర్ స్పోర్ట్స్, బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ పోటీలు, పలు ఈవెంట్లు ఏర్పాటు
- 16 రాష్ట్రాల నుంచి 600 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల రాక
- 60 అడుగుల గేట్ వే ఆఫ్ అమరావతి స్థూపం ఆవిష్కరణకు సిద్ధం

బీచ్ పండుగకు వేళాయె!

నేడు మంగినపూడిలో మసులా బీచ్ ఫెస్టివల్

మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించే 'మసులా బీచ్ ఫెస్టివల్-2025'కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం బీచ్ పండుగ అట్టహాసంగా ప్రారంభం కానుంది. 60 అడుగుల ఎత్తుతో నిర్మించిన గేట్ వే ఆఫ్ అమరావతి స్థూపాన్ని ముఖ్యఅతిథులు ఆవిష్కరించనున్నారు. మన ఊరు- మన పండుగ నినాదంతో నాలుగు రోజుల పాటు జరిగే ఈ పండుగలో జాతీయ స్థాయి వాటర్ స్పోర్ట్స్, బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ పోటీలు, సినీ రంగ ప్రముఖులతో స్టేజ్ ఈవెంట్స్, ఎమ్యూజ్‌మెంట్, ఎంటర్‌టైన్‌మెంట్, అడ్వెంచర్ స్పోర్ట్స్ పర్యాటకులను అలరించనున్నాయి. 6



మచిలీపట్నంలో విద్యుత్ వెలుగులు

రాజధాని రైతుల ప్లాట్లకు నేడు ఈ-లాటరీ

8లో



బీచ్‌లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

8లో

- సముద్రం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ బాలాజీ

సుపరిపాలన



రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతమై కూటమి నేతృత్వంలో సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని అవనిగడ్డలో కూటమి నాయకులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కూటమి నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన



రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెడన పట్టణంలో వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము తదితరులు పాల్గొన్నారు.

బదిలీల వేళ పదోన్నతులు

జడ్పీలో ధనకార్యాలు

ఆరుగురు ఉద్యోగులకు పదోన్నతుల వివాదం

- నిబంధనలకు విరుద్ధంగా బదిలీల సమయంలో..
- భారీగా డబ్బు వసూలు చేశారనే ఆరోపణలు
- ఏవో పోస్టింగుల్లోనూ అవినీతి వ్యవహారాలు



బదిలీల వేళ.. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్‌లో కొందరు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించటం వివాదాస్పదమవుతోంది. ఈ ముసుగులో జడ్పీ కార్యాలయ అధికారులు భారీగా ముడుపులు దండుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఐదేళ్ల ఒకేచోట సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు బదిలీలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు ఈనెల 9వ తేదీ వరకు గడువు విధించింది. అయితే, కృష్ణాజిల్లా పరిషత్‌లో బదిలీల వేళ ఉద్దేశపూర్వకంగా పదోన్నతులకు తెరతీశారు. జడ్పీ చైర్‌పర్సన్ హారిక, సీఈవో కన్నమనాయుడు సమక్షంలో కొందరైతే సంబరాలు చేసుకున్నారు. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియ అమల్లో ఉన్నపుడు పదోన్నతులు ఇవ్వకూడదు. ఎందుకంటే.. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీనియర్లు ఉంటే వారికి వారు స్థానచలనం కలిగేటప్పుడు అన్యాయం జరుగుతుందని. బదిలీలు పూర్తిగా నిర్వహించాక పదోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తే ఎవరికి ఏ సమస్యా ఉండదు. కానీ, ఉమ్మడి కృష్ణా జడ్పీ అధికారులు ఆకస్మాత్తుగా పదోన్నతుల వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు. జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న కొందరికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. ఈ పదోన్నతుల వ్యవహారం మాటున జడ్పీ కీలక అధికారి పాత్ర ఉందని, భారీగా ముడుపులపర్వం నడిచిందన్న ఆరోపణలు వస్తున్నాయి. జడ్పీ కార్యాలయంలోని మిగతా 6లో..

గత ఐదేళ్ల ముచ్చట

జడ్పీలో పోస్టింగ్‌లు అంటే ముడుపుల వ్యవహారంగా మారింది. ప్రభుత్వ మార్గదర్శకాలకు భిన్నంగా కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో బదిలీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు. జడ్పీ చైర్‌పర్సన్ భర్త అనధికారికంగా జడ్పీ కార్లను ఉపయోగించటంతో పాటు ఆయిల్‌ను కూడా విచ్చలవిడిగా వాడుకునేవారు. ఆయన చెప్పినట్టుగానే పాలన నడిచేది. తన అనుచరులకు పోస్టులు ఇచ్చుకునేవారు. జడ్పీలో పనిచేసే వారిని ఇంటి దగ్గర పని చేయించుకునేవారు. ఆస్తులను అన్యులకు కట్టబెట్టారు. రెన్నోవేషన్ పేరుతో జరిగిన పనుల్లోనూ అవినీతి జరిగింది. విజయవాడలోని జడ్పీ కార్యాలయంతో పాటు జడ్పీ ఆవరణలో ఉన్న జేసీ కార్యాలయాన్ని కూడా పడేసేందుకు ప్లాన్ వేయగా, అప్పటి కలెక్టర్ ఢిల్లీరావు అడ్డుపడ్డారు. ఈ వ్యవహారాలు మీడియాకు చెబుతున్నారన్న అనుమానంతో కొందరు ఉద్యోగులను శివారు ప్రాంతాలకు బదిలీ చేశారు.

మెగా డీఎస్సీకి పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ డి.కె.బాలాజీ
- పరీక్షల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం

మచిలీపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు నిర్వహించనున్న మెగా డీఎస్సీ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డి.కె.బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టర్‌లోని తన చాంబర్లో మెగా డీఎస్సీ నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారు లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాల్లో 1,208 పోస్టులకు వివిధ సెషన్ల వారీగా ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కంప్యూటర్ ఆధారిత మెగా డీఎస్సీ పరీక్షలు జరుగుతా యన్నారు. శ్రీవాసవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ మిగతా 6లో..

పాపం ఖయ్యూం!

పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడు

నేటికీ అందని ప్రభుత్వ పింఛను



మహమ్మద్ ఖయ్యూం

- చనిపోయిన తండ్రి పేరుతో పాటు ఖయ్యూం పేరు రేషన్ కార్డు నుంచి తొలగింపు
- వైసీపీ హయాంలో వలంటీర్, సచివాలయ ఉద్యోగి నిర్లక్ష్యమే దీనికి కారణం
- మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న దివ్యాంగుడి తల్లి

ఆంధ్రజ్యోతి-గుడివాడ: గుడివాడ పట్టణం 11వ వార్డుకు చెందిన మహమ్మద్ ఖాసిం, ప్యారీ జాన్‌లకు మానసిక దివ్యాంగుడైన కుమారుడు మహమ్మద్ ఖయ్యూం ఉన్నాడు. అతను పుట్టుకతో మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. అయితే 2017లో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకున్నారు. అందులో మిగతా 6లో..



జగన్ హయాంలో ఖయ్యూం పేరు లేకుండా జారీ చేసిన రైస్ కార్డు

వార్డు వలంటీర్, గ్రామ సచివాలయ ఉద్యోగి నిర్లక్ష్యం ఒక దివ్యాంగుడికి శాపంగా మారింది. చనిపోయిన తండ్రితో పాటు కుమారుడి పేరును సైతం వైసీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డులో నుంచి తొలగించారు. దీంతో 75 శాతం మానసిక దివ్యాంగుడిగా వైద్యులు ఇచ్చిన సర్టిఫికేట్ ఉండి, అర్హత ఉన్న దివ్యాంగుడు పింఛనుకు దూరమయ్యాడు. రేషన్ కార్డులో పేరు చేర్చి, పింఛన్ ఇవ్వాలని కోరుతూ తల్లీకొడుకులు మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వీరిని చూసిన స్థానికులు పాపం ఖయ్యూం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అతిథులకు ఆహ్వానం..

జాతీయ స్థాయిలో గురువారం నుంచి కృష్ణాజిల్లా మంగినపూడి బీచ్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న మసులా బీచ్ ఫెస్టివల్ ప్రేక్షకుల ను ఉర్రూతలూగించనుంది. వేలాది క్రీడాకారులు, కళాకారులతో నిర్వహించే బీచ్ ఫెస్టివల్ కృష్ణా జిల్లా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించనున్నారు. నెలరోజులుగా కళాకారులు నిర్మిస్తున్న కళాఖండాలు బీచ్‌లో ఒక ప్రత్యేకత సంతరించుకున్నాయి. నాలుగు రోజుల పాటు 15 లక్షల మంది సందర్శకులు బీచ్‌కు రానున్న దృష్ట్యా జిల్లా యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి నాలుగు రోజులు 'మసులా ఫెస్ట్' సంబరాలు

- మంగినపూడి బీచ్‌లో కొలువుదీరిన కళాకృతులు
- ప్రత్యేక ఆకర్షణగా గేట్ వే ఆఫ్ అమరావతి
- 60 రకాలకు పైగా ఫుడ్ స్టాల్స్
- జల క్రీడలకు జిల్లాకు చేరుకున్న క్రీడాకారులు
- ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు



సందర్శకులను ఆకట్టుకునేలా తీరం వెంబడి ఏర్పాటు చేసిన కళాకృతులు

విజయవాడ/మచిలీపట్నం టౌన్ జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సముద్రతీరంలో.. ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించేందుకు పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడతారు. బీచ్‌లో ఇసుక తెన్నెలపై సరదాగా గడపాలన్న ఆశ అందరికీ ఉంటుంది. వారి ఆశలను నిజం చేస్తూ మచిలీపట్నం సాగరతీరాన నేటి నుంచి 8వ తేదీ (ఆదివారం) వరకు నాలుగు రోజుల పాటు 'మసులా ఫెస్ట్' బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా జాతీయ స్థాయి క్రీడలు, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలకు మంగినపూడి బీచ్ వేదిక కానుంది. జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరానుండటంతో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.



కార్యక్రమం విజయవంతం కావాలని యాగం నిర్వహిస్తున్న కొల్లు నీలిమ

ప్రత్యేక ఆకర్షణగా గేట్ వే ఆఫ్ అమరావతి

'మసులా ఫెస్ట్'లో గేట్ వే ఆఫ్ అమరావతి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే మంగినపూడి బీచ్‌ను సర్వాంగ సుందరంగా రకరకాల బొమ్మల ఆకృతులతో అందంగా తీర్చిదిద్దారు. బీచ్ ఫెస్టివల్‌లో స్టాల్స్, కార్యక్రమాలను పరిచయం చేసేలా మరో గేటు కూడా ఏర్పాటు చేశారు. సముద్ర జీవులైన శంఖం, అమీబా, నత్త, చేపల బొమ్మలు సందర్శకులను కనువిందు చేయనున్నాయి. బీచ్‌లో వంద అడుగులతో త్రివర్ణ పతాకాన్ని ఏర్పాటు చేశారు.

60 రకాలకు పైగా ఫుడ్‌స్టాల్స్

వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన సుమారు 60రకాల ఫుడ్‌స్టాల్స్‌తో బీచ్ ఫెస్టివల్ ఆహారప్రియులను అలరించనుంది. రాష్ట్రానికి చెందిన వంటకాలే కాకుండా దేశంలోనే ప్రసిద్ధి చెందిన రుచులకు మంగినపూడి బీచ్ వేదిక కానుంది. ఫుడ్‌స్టాల్స్‌తో పాటు కలంకారీ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల స్టాల్స్ పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి.

క్రీడలతో కొత్త కళ

ఈసారి బీచ్ ఫెస్టివల్ క్రీడలతో కొత్తకళ సంతరించుకోనుంది. జాతీయ స్థాయిలో బీచ్ కబడ్డీ, వాలీబాల్, జలక్రీడలు సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచేలా.. కనోయింగ్(సముద్ర అలలపై బోటు విహారం) మరింత ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే 29 రాష్ట్రాలకు చెందినన క్రీడాకారులు బందరు చేరుకున్నారు.

విజయవంతం చేయాలి

బందరులో జరిగే 'మసులా ఫెస్ట్' రాష్ట్ర పర్యాటక రంగానికి తోడ్పాటును అందిస్తుందని మంత్రి నారా లోకేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగినపూడి బీచ్‌లో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్ దేశంలోనే అతిపెద్దదిగా ఆయన అభివర్ణించారు. పర్యాటక రంగం అభివృద్ధితో పాటు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. మంత్రి రవీంద్రను ఆదర్శంగా తీసుకుని తీరప్రాంత ఎమ్మెల్యేలు తమ వంతు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. బీచ్‌ఫెస్టివల్‌లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. - మంత్రి నారా లోకేశ్



కార్యక్రమ విజయవంతం కావాలని..

బీచ్ ఫెస్టివల్ విజయవంతం కావాలని వేద పండితుల సహకారంతో పీవీ ఫణికుమార్ రుద్రహోమం నిర్వహించారు. హోమ కార్యక్రమాల్లో మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ పాల్గొన్నారు. బీచ్ ఫెస్టివల్ ఏర్పాటుకు కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ప్రతినిధులు గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, చిత్తజల్లు నాగరాము తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

జాతీయ స్థాయిలో ఫెస్ట్..

మసులా బీచ్ ఫెస్టివల్-2025 జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నాం. 2018లో అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఈసారి నాలుగు రోజులపాటు బీచ్ ఫెస్టివల్‌ను మెగా ఈవెంట్‌గా నిర్వహిస్తున్నాం. 'మన ఊరు-మనపండుగ' నినాదంతో జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నాం.

- మంత్రి కొల్లు రవీంద్ర



అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు

- కలెక్టర్ బాలాజీ



మసులా బీచ్ ఫెస్టివల్‌లో పర్యాటకశాఖ, ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ, రెవెన్యూ, ముడా, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులు నెల రోజులుగా పనిచేస్తున్నారు. యాత్రీకులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టాం. చిలకలపూడి నుంచి మంగినపూడి బీచ్ వరకు యాత్రికులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. కోనేరుసెంటర్ నుంచి ఆర్టీసీ బస్సులు, బీచ్‌కు వచ్చే అతిథులకు అన్ని ఏర్పాట్లు చేశాం.

బీచ్ ఫెస్టివల్‌కు ప్రత్యేక రూట్లు

- ఎస్పీ గంగాధరరావు



బీచ్ ఫెస్టివల్‌కు వెళ్లే వాహనాలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రత్యేక రూట్లలో దారి మళ్లించాం. టూరిస్టు బస్సులకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశాం. అలాగే టూ వీలర్లకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశాం. కార్లు, ఆటోల్లో వచ్చి తిరిగి వెళ్లేవారు గిరిపురం, సత్తెనపాలెం, వాటర్ ట్యాంకు జంక్షన్, కెనరా బ్యాంకు పక్క నుంచి కంసాలివారిపాలెం, జి సత్తెనపాలెం, గోకవరం, కాకర్లమూడిపాలెం, నందమూరు గ్రామాల మీదుగా నేషనల్ హైవేకు చేరుకోవాల్సి ఉంటుంది.

ట్రాఫిక్ ఆంక్షలు

గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. చల్లపల్లి, విజయవాడ, గుడివాడ వైపు నుంచి వచ్చే వాహనాలను చిలకలపూడి రింగ్, చిలకలపూడి రైల్వే గేటు వైపుగా తరలిస్తారు. బీచ్‌కు ఎడమ వైపు కార్లు, కుడివైపు బైక్‌లు పార్కింగ్ చేసే విధంగా ఏర్పాటు చేశారు. బస్సులు, లారీలు బైక్‌లు పార్కింగ్ చేసే వైపు కొంచెం దూరంగా తిరిగి ప్రయాణానికి తిప్పుకునే విధంగా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజలు తరలి రావాలి

మంగినపూడి బీచ్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న బీచ్ ఫెస్టివల్‌కు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. జాతీయస్థాయి క్రీడాకారులు ఫెస్టివల్‌కు రావడం ముదావహం. క్రీడాభిమానులు ఈ పోటీలను తిలకించి స్ఫూర్తిని పొందుతారని ఆశిస్తున్నాం.

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ



ప్రత్యేక స్టాల్స్, ఫుడ్‌కోర్టులు

బీచ్ ఫెస్టివల్‌లో స్టాల్స్, ఫుడ్‌కోర్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. యువత కేరింతలు కొట్టేలా ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. గొప్ప కళాకృతులు బీచ్ ఫెస్టివల్‌కు రానున్నాయి. ప్రణాళికాబద్ధంగా బీచ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు.

- డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ



కార్యక్రమాల వివరాలు..

- గురువారం జాతీయస్థాయి క్రీడలతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఉదయం 9 గంటలకు క్రీడాకారుల ఆధ్వర్యంలో 60 అడుగుల ఎత్తులో అసెంబ్లీ, అమరావతి నమూనాతో ఏర్పాటు చేసిన గేట్ వే ఆఫ్ అమరావతి, 100 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరణ.
- శుక్రవారం సాయంత్రం నుంచి మూడురోజుల పాటు సినీ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 100కు పైగా ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు. తొలిసారిగా జాతీయస్థాయిలో సీ కయాకింగ్ స్పోర్ట్స్. 16 రాష్ట్రాల నుంచి 600 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారు. బీచ్ వాలీబాల్ పోటీలు పురుషులకు, మహిళలకు వేర్వేరుగా లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పురుషుల జట్లు పాల్గొంటారు. విశాఖపట్నం పశ్చిమగోదావరిజిల్లా, గుంటూరు జిల్లాల మహిళల జట్లు పాల్గొంటాయి.



డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమా, వసంత కృష్ణప్రసాద్

విజయవాడలో సమస్యలు పరిష్కరించండి

- డీఆర్ఎం నరేంద్రతో ఎంపీ, ఎమ్మెల్యేల భేటీ

రైల్వేస్టేషన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గుణదలలోని రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి), రాయనపాడు స్టేషన్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లు డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్‌ను కోరారు. బుధవారం డీఆర్ఎంను ఆయన చాంబర్‌లో కలిసి విజయవాడ సెంట్రల్, పశ్చిమ, మైలవరం నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా వారు సెంట్రల్, పశ్చిమ, మైలవరం నియోజకవర్గాల్లో సమస్యలను డీఆర్ఎంకు వివరించారు. సెంట్రల్‌లో 2009 నుంచి పూర్తికాని ఆర్ఓబీ పనులకు డీపీఆర్వో సిద్ధమైందని, కానీ పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. వాంబేకాలనీ దేవీనగర్ కట్ట వద్ద ప్రజలు రైల్వే ట్రాక్ దాటేందుకు ఇబ్బంది పడుతున్నారని, ప్రమాదాలకు గువుతున్నారని రైల్వే ఉన్నతాధికారులు స్పందించి అండర్ పాస్ లేదా ఆర్ఓబీ నిర్మించాలని కోరారు. సింగ్‌నగర్ రెండో ఆర్ఓబీని గురించి వివరించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మీసాల రాజారావు వంతెన నుంచి స్టేషన్‌వరకు రోడ్డును అభివృద్ధి చేయాలని, ఎర్రకట్ట బ్రిడ్జిని మరింత విస్తరించి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన పనులకు అనుమతులకు పూర్తి సహకారం అందజేస్తామని ఎంపీ తెలిపారు. అనంతరం డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఏడీఆర్ఎం ఎడ్విన్, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్‌లు మనోహర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రావు, సీనియర్ డీఈ ఎస్.వరుణ్‌బాబు, సీనియర్ డీసీఎం వి.రాంబాబు, సీనియర్ డీవోఎం నరేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..!

- సీపీకి వినతిపత్రం ఇచ్చిన గులకరాయి కేసు నిందితుడు

విజయవాడ, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు అజిత్‌సింగ్ నగర్‌లో మాజీ సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడి కేసులో తనను అన్యాయంగా ఇరికించారని నిందితుడు వేముల దుర్గారావు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు వినతిపత్రం అందజేశాడు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి దుర్గారావు సీపీని కలిశాడు. అప్పటి పోలీసు అధికారులు తనను, తన భార్యను బెదిరించి నేరం మోపారని ఆరోపించాడు. ఆ అధికారులపై కేసు నమోదు చేసి, న్యాయం చేయాలని కోరాడు.

గన్నవరం వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

గన్నవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం వైసీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని సాక్షిగా విభేదాలు బయటపడ్డాయి. గన్నవరంలో 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించగా.. పాల్గొనేందుకు వచ్చిన బాపులపాడు మండల అధ్యక్షుడు నక్కా గాంధీ రాష్ట్ర వైద్య విభాగం మాజీ అధ్యక్షుడు జి.శివభరత్ రెడ్డిని చూసి వెనుదిరిగారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ వెన్నుపోటు పొడిచిన వారే వైసీపీలో ఉన్నారని, అందుకే కార్యక్రమంలో పాల్గొనకుండా వెళ్లిపోతున్నాని ఆవేదన వ్యక్తం చేశారు. వంశీ, దుట్టా మధ్య ఎలాంటి తగవులేదని, వీరి మధ్య శివ భరత్‌రెడ్డే గొడవ పెట్టారని ఆరోపించారు. శివ భరత్ రెడ్డి మాత్రం ఇక్కడ ఉండి.. దుట్టా రామచంద్రరావును పార్టీకి దూరం చేశారన్నారు. ఈయన వల్ల అన్యాయమే తప్ప న్యాయం జరగదని విమర్శించారు. ఆయనతో కలిసి ప్రయాణం చేయలేనని చెప్పారు. బుధవారం జరిగిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి వైసీపీ శ్రేణులు ఊహించినంతగా హాజరుకాకపోవటంతో కార్యకర్తల్లో నిరాశ వ్యక్తమైంది.

గాడిన పడిన వ్యవసాయ రంగం

- మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో కొనకళ్ల నారాయణ

గుడివాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయరంగం గాడిలో పడిందని, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, రైతులకు మేలుచేసే కార్యక్రమాలను మార్కెట్ యార్డు కమిటీ నిర్వహించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ, రాష్ట్రంలో సైకోపాలన పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజునే మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయడం సంతోషకరమన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రాకతో రైతాంగం సంతోషంగా ఉందని, ధాన్యం నగదును కేవలం 24గంటల్లో వారి ఖాతాల్లో జమ చేసి మంచి ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ, నిరుపేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు తోడుగా ఉంటుందన్నారు. కుప్పంలో చంద్రబాబు గెలిస్తే బూట్లు తుడుస్తా అని ప్రగల్భాలు పలికిన వ్యక్తి ఏడాదిగా ఎక్కడికి పారిపోయాడో చెప్పాలన్నారు. గుడివాడ అభివృద్ధిని ఎవరు అడ్డుకోవాలని చూసినా సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం సబ్సిడీపై విత్తనాలను, వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, రాంబాబు, దానేటి సన్యాసిరావు, మురళీ, జనసేన పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామినేని వెంకటకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత నూతన కమిటీ చైర్మన్ చాట్రగడ్డ రవి, సభ్యులు భారీ ర్యాలీగా మార్కెట్ యార్డుకు తరలివచ్చారు. అనంతరం మార్కెట్ యార్డు కార్యదర్శి భాస్కరరావు నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్‌గా చాట్రగడ్డ రవి, వైస్ చైర్మన్‌గా గొరిపర్తి వెంకటనాగ సుబ్బారావు, సభ్యులుగా ఆలుమూరి మురళీకృష్ణ, చీకటి నాగలక్ష్మీ, గంపా వెంకటరమణ, గుల్లపల్లి రమాదేవి, కట్టా శ్రీనివాసరావు, కొండపల్లి రాఘవరెడ్డి, లింగం శివరావు, సూరపనేని ప్రదీప్, వెలగలేటి వెంకటేశ్వరమ్మ, యడ్లపల్లి నాంచారమ్మ, రషీద్ బేగ్, తోటనాగలక్ష్మి, వీర్ల విజయలక్ష్మి, వడ్డే క్రాంతికుమార్‌లు ప్రమాణస్వీకారం చేశారు.



మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డను సత్కరిస్తున్న కొనకళ్ల నారాయణ, వెనిగండ్ల

9న విశాఖ స్టీల్ కార్మికులకు సంఘీభావ నిరసన

వన్‌టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీలు ఉత్పత్తిలో 13వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు కంపెనీల ఒత్తిడితో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 5,400 మందిని తొలగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి ముందస్తు నోటీసులు, నష్టపరిహారం చెల్లించకుండా, ఏకపక్ష నిర్ణయంతో తొలగించటం చట్టవిరుద్ధమన్నారు. దీనికి నిరసనగా కార్మికులు మే 20 నుంచి నిరవధిక సమ్మెకు నోటీసు ఇచ్చారని తెలిపారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టీల్ ప్లాంట్‌ను ఖైదీల జైలుగా మార్చిందని విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్ర మాట్లాడుతూ, 40 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా స్టీల్ ప్లాంట్ దగ్గర పోలీసుల మెహరింపు పెరుగుతుందని విమర్శించారు. స్టీల్ ప్లాంట్‌ను నూరుశాతం ప్రైవేటీకరించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పోలారి మాట్లాడుతూ, ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు అనకాపల్లిలో ఇనుప ఖనిజ గనుల కోసం కేంద్ర ప్రభుత్వంపై సీఎం చంద్రబాబు ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాస్తి కిషోర్ బాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మరీదు ప్రసాదబాబు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఏవీ నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ కార్మికులకు సంఘీభావంగా ఈనెల 9న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు వ్యక్తం చేసే కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



ఫెరోజ్

స్నేహితుడిపై హత్యాయత్నం

- ట్యూబ్‌లైట్ పగులగొట్టి గొంతులో పొడిచిన నిందితుడు
- వివాహేతర సంబంధమే కారణం
- బాధితుడు, నిందితుడి ఇంట్లో గంజాయి స్వాధీనం

విజయవాడ, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం ఇద్దరు ప్రాణ స్నేహితుల మధ్య నిప్పు రాజేసింది. ఒకరి ప్రాణాన్ని మరొకరు తీసుకునే పరిస్థితిని తెచ్చింది. తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న స్నేహితుడిని ట్యూబులైట్ పగలగొట్టి పొడిచాడు ఓ యువకుడు. ఈ ఘటన విజయవాడ చుట్టుగుంటలో బుధవారం జరిగింది. ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంతానికి చెందిన షెకావత్ ఆలీ టైల్స్ వర్కర్. కొన్నాళ్ల క్రితం ఆలీ ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఒక పాప ఉంది. కొంతకాలం తర్వాత దంపతుల మధ్య వివాదాలు మొదలయ్యాయి. తనను వేధిస్తున్నాడని ఆలీ భార్య మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు క్రైం నంబర్ 10/2025తో కేసు నమోదు చేశారు. ఆలీ కోసం తరచుగా ఇంటికి వెళ్లిన అరండల్ పేటకు చెందిన ఫెరోజ్ అతడి భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కేసు నమోదైన తర్వాత ఆలీ కుటుంబాన్ని వదిలేసి హైదరాబాదుకు వెళ్లిపోయాడు. తర్వాత ఈ వివాదాలకు కారణం ప్రాణ స్నేహితుడైన ఫెరోజ్ అని గుర్తించాడు. ఇద్దరూ కలిసి కొన్నాళ్ల క్రితం మద్యం తాగుతున్న సందర్భంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. తన భార్యతో వివాహేతర సంబంధం నడపడం సరికాదని, అది మంచి స్నేహం కాదని ఫెరోజ్‌తో ఆలీ అన్నాడు. ఈ సందర్భంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో చంపేస్తానని ఫెరోజ్‌ను ఆలీ బెదిరించాడు. వివాదాల తర్వాత ఆలీ భార్య పిల్లను తీసుకుని చుట్టుగుంటలోని ఓ బార్‌కు పక్క వీధిలో ఉన్న పుట్టింటికి వెళ్లిపోయింది.

భార్య, పిల్లను చూడటానికి వచ్చి..

హైదరాబాదు నుంచి ఆలీ భార్య, పిల్లను చూసేందుకు రెండురోజుల క్రితం విజయవాడకు వచ్చాడు. ఆలీ ఇంట్లో ఉన్న విషయాన్ని అతడి బావమరిది బాషా ఫోన్‌చేసి ఫెరోజ్‌కు చెప్పాడు. అత్తగారి ఇంట్లో ఆలీ నిద్రిస్తుండగా మధ్యాహ్నం నుంచి ఫెరోజ్ అతడి స్నేహితుడు అమ్మకల్లు కలిసి అక్కడికి వెళ్లారు. ఫెరోజ్ ఒక కట్టర్‌ను వెంటబెట్టుకుని తీసుకెళ్లాడు. నిద్రలేచి బయటికి వచ్చిన ఆలీపై కట్టర్‌తో దాడి చేశాడు. కట్టర్ ఛాతీకి తగలడంతో ఆలీకి గాయమైంది. వెంటనే అతడు ఇంట్లోకి వెళ్లి ట్యూబ్‌లైట్ తీసుకొని రెండు ముక్కలు చేశాడు. పగిలిన ట్యూబులైట్‌తో ఫెరోజ్ గొంతులో బలంగా పొడిచాడు. పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని ఫెరోజ్‌ను ఆసుపత్రికి తరలించారు. ఘటన తర్వాత ఆలీ నేరుగా మాచవరం పోలీసుస్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆలీ ఉన్న గదిని తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్ లభించింది. తర్వాత ఫెరోజ్ ఇంట్లో తనిఖీలు చేయగా అక్కడా గంజాయి లభించింది. ఫెరోజ్‌పై మొత్తం 15 కేసులు ఉన్నాయి. రెండు హత్య కేసులు, 12 దొంగతనాలు, ఒక గంజాయి కేసులో ఫెరోజ్ నిందితుడిగా ఉన్నాడు. తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాల్లో అతడిపై కేసులు నమోదయ్యాయి. తూర్పుగోదావరి జిల్లాలో ధవళేశ్వరం బొమ్మూరు పోలీస్‌స్టేషన్లలో రెండు హత్య కేసులు ఉన్నాయి. కృష్ణాజిల్లాలో పెదపారుపూడి, ఉయ్యూరు, ఆత్కూరు పోలీస్ స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయి. ఫెరోజ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

పాపం ఖయ్యూం!

(5వ పేజీ తరువాయి)

75 శాతం మానసిక దివ్యాంగుడిగా నిర్ధారించారు. అప్పటి నుంచి దివ్యాంగుల పింఛను కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఎవరూ పట్టించుకోలేదు. ఈ క్రమంలో మహమ్మద్ ఖాసిం చనిపోయాడు. గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డుల స్థానంలో రైస్ కార్డులు జారీ చేసింది. ఈ సమయంలో చనిపోయిన తండ్రి ఖాసిం పేరు తొలగించే క్రమంలో వార్డు వాలంటీర్, గ్రామ సచివాలయ ఉద్యోగి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఖయ్యూం పేరు కూడా రైస్ కార్డు నుంచి తొలగించేశారు. వీరు చేసిన తప్పు దివ్యాంగుడి పాలిట శాపంగా మారింది. రేషన్ కార్డులో పేరు చేర్పించడం కోసం గత మూడేళ్లుగా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. బియ్యం కార్డులో పేరు లేదనే కారణంతో తన కుమారుని పింఛను దరఖాస్తును అధికారులు తీసుకోవడంలేదని ఖయ్యూం తల్లి ప్యారీజాన్ వాపోతున్నారు. కూలీ పని చేసుకుని బతికే తాను 19 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగ కుమారుడి పోషణ, మందులకు డబ్బుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కన్నీరు పెట్టుకున్నారు.



ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికేట్

కూటమి ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకుంటే..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులో పేర్లు చేర్పులు, మార్పులకు అవకాశం ఇవ్వడంతో ఎంతో ఆశతో ప్యారీజాన్ తిరిగి తన కుమారుడి పేరును కార్డులో చేర్చాలంటూ దరఖాస్తు చేసుకుంది. కానీ నిబంధనలు ఆమె పాలిట శాపంగా మారాయి. 18 ఏళ్ల వయస్సు దాటడంతో ఆన్‌లైన్‌లో పేరు చేర్చడానికి అవకాశం లేదని, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ జారీ చేసిన నిబంధనల్లో 18 ఏళ్లు లోపు వారి పేర్లు మాత్రమే చేర్చాలనే నిబంధన ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో తల్లీకొడుకులు ఉన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

మెగా డీఎస్సీకి పకడ్బందీ ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

టెక్నాలజీ-నందమూరు, ఆయాన్ డిజిటల్ జోన్ ఐడిజెడ్- కానూరు, వెలగపూడి రామకృష్ణ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల- కానూరు, ప్రసాద్ వి పొట్లూరి సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- కానూరు, ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ- గంగూరు, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ - గుడ్లవల్లేరు, శ్రీవిజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ - కానూరులో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని చెప్పారు. ఆయా పరీక్షా కేంద్రాలకు అభ్యర్థుల రాకపోకల నిమిత్తం రవాణా సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు పాల్గొన్నారు.

బదిలీల వేళ పదోన్నతులు

(5వ పేజీ తరువాయి)

సీసీ ఒకరు... పదోన్నతులు అందుకోబోయే కొందరి నుంచి భారీగా ముడుపులు వసూలు చేసినట్టు తెలుస్తోంది.

ఏవో పోస్టింగుల్లో అవినీతి కంపు

జడ్పీ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఏవోలను సస్పెండ్ చేశారు. వీరు 4 నుంచి 8 నెలల్లోపు తగిన కారణాలు చూపిస్తే తిరిగి పోస్టింగ్ పొందొచ్చు. సస్పెండ్ అయిన 6 నెలల తర్వాత కూడా ఇప్పటికీ పోస్టింగ్‌లు ఇవ్వలేదు. వీరికి తిరిగి పోస్టింగ్‌లు ఇప్పిస్తామన్న ఆఫర్ ఇచ్చి భారీగా డబ్బు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, వీరికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా.. మరో ఇద్దరికి వారి స్థానాల్లో పోస్టింగ్‌లు కల్పించారు. ఈ వ్యవహారంలోనూ కాసులు చేతులు మారాయన్న ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం.. సస్పెండ్ అయిన పోస్టుల్లో ఆరు నెలల వరకు ఎవరికీ పోస్టింగ్‌లు ఇవ్వకూడదు. కానీ జడ్పీ అధికారులు అనధికారికంగా పోస్టింగ్‌లు ఇచ్చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

శరవేగంగా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి పనులు

గన్నవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శరవేగంగా అభివృద్ధి పనులు సాగు తున్నాయని అభివృద్ధి కమిటీ డైరెక్టర్ బుస్సే నాగ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆస్పత్రిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగ ప్రసాద్ మాట్లాడు తూ, గత ఐదేళ్ల కాలంలో మాజీ ఎమ్మెల్యే అవినీతి మీద పెట్టిన దృష్టి ఎదురుగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధిపై పెట్టలేకపోయారని అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన యార్లగడ్డ వెంకట్రావు ముందుగా ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించి నియోజకవర్గంలో అందరికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై ప్రచార జాతా

ఉయ్యూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, ఓజోన్ పొర విశిష్టత తెలియజేస్తూ గుడివాడ బిళ్లపాడు కళాకారుల బృందం ఉయ్యూరులో బుధవారం కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతాలో భాగంగా మానవ జీవన విధానాన్ని మెరుగుపరుచుకునే విధంగా అవలంబించవలసిన జాగ్రత్తలు, మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పరిరక్షణకు తీసుకోవాలిసిన జాగ్రత్తలు కళాకారుల బృందం సభ్యులు ఎడవల్లి వీరయ్య, నాగేంద్ర, రవితేజ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.

మండల సమావేశం 10న

ఉంగుటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం 10న స్థానిక స్త్రీశక్తిభవనం మీటింగ్ హాలులో జరుగుతుందని ఎంపీడీవో ఈ సత్యకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అన్నిగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.



బహుమతులు అందజేస్తున్న ఆయుష్ డాక్టర్ ఉషారాణి

యోగా పోటీల విజేతలకు బహుమతులు

ఉయ్యూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని మండల పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా నాల్గవ రోజు నిర్వహించిన యోగా పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆకునూరు ఆయుష్ ఆయుర్వేద డాక్టర్ ఉషారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీవో శేషగిరిరావు, యోగా శిక్ష కులు కృష్ణ, శ్రీనివాస్, కాళిదాస్ పాల్గొని బహుమతులు అందజేశారు.

డీలర్ల వ్యవస్థపై ప్రభుత్వ నమ్మకాన్ని కాపాడుకోవాలి

ఉంగుటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్ల వ్యవస్థపై నమ్మకం వుంచిన కూటమి ప్రభుత్వ నమ్మకాన్ని కాపాడుకోవాలని ఏపీ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు కాగిత కొండ(జేమ్స్) డీలర్లకు సూచించారు. బుధవారం మండలంలోని పొట్టిపాడులో సంఘం నాయకులను కలిశారు. ఆయన వెంట రేషన్ డీలర్ల సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షురాలు యనమల లలిత, మండల అధ్యక్షులు బొబ్బిలి నవీన్, గౌరవాధ్యక్షులు జోజప్ప తదితరులు ఉన్నారు.

రోడ్డుపైకి మురుగు!

● దుర్వాసన.. ఈగలు, దోమలకు నిలయం..
● ఇబ్బందిపడుతున్న కానూరు వాసులు.. పట్టించుకోని అధికారులు

(కానూరు - ఆంధ్రజ్యోతి)

తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరులో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారవ్వడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. డ్రైయినేజీలు పొంగి పొర్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా కానూరులోని ఓపెన్ డ్రైయినేజీ పొంగి విజయవాడ- మచిలీపట్నం రహదారిపైకి మురుగునీరు ప్రతి నిత్యం వస్తూ ఉండటంతో స్థానికులతోపాటు పాదచారులు, వాహనచోదకులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకపక్క దుర్వాసన, మరోపక్క ఈగలు, దోమలకు నిలయంగా మారింది. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోని డ్రైయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కానూరు వాసులు కోరుతున్నారు.



కానూరులో డ్రైయినేజీ పొంగడంతో విజయవాడ- మచిలీపట్నం రహదారిపైకి వచ్చిన మురుగు నీరు

కూటమి ప్రభుత్వంతో సంక్షేమ పాలన

హనుమాన్‌జంక్షన్, కంకిపాడులో కూటమి నేతల సంబరాలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారని రానున్న నాలుగేళ్లు ఇలాగే కొనసాగాలని జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు మేరకు బుధవారం జంక్షన్‌లో రమేశ్‌బాబు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బాణాసంచా కాల్చి కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు, ఆ పార్టీ జిల్లా నాయకులు చిమటా రవివర్మ మాట్లాడుతూ, గత వైసీపీ అరాచక పాలన చవి చూసిన ప్రజలు కూటమి ప్రభుత్వం రాకతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్న సీఎం చంద్ర బాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తెలుగు మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, జనసేన నాయకులు వడ్డి శివనాగేశ్వరరావు, అహ్మద్, బీజేపీ జిల్లా నాయకులు తోట మురళీధర్, వీరమహిళలు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



కంకిపాడులో కూటమి నాయకుల ర్యాలీ

వైసీపీ పీడ విరగడైంది

కంకిపాడు : కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిన శుభసందర్భం, వైసీపీ పీడ విరగడై సంవత్సరం గడిచిన సందర్భంగా కంకిపాడులో బుధవారం కూటమి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో అరాచక, అవినీతి, చేతకాని వైసీపీ దుష్టపాలన అంతమైందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో ప్రజలు సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు అందుకుం టున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్రామ్ అన్నారు. ప్రదర్శన అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి స్వీట్లు పంచారు. కూటమి నాయకులు బండ్రెడ్డి రామకృష్ణ, హరికృష్ణ, అన్నే ధనయ్య, పులి కామేశ్వరరావు, సుదిమల్ల రవీంద్ర, చిట్టూరి నాగేశ్వరరావు, పులి శ్రీను తదిరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలను తిలకిస్తున్న కూటమి నాయకులు

డబ్బు దాచుకోవడానికే ప్రత్యేక విమానాల్లో

వైసీపీ నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి పేర్ని నాని

గన్నవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : దోచుకున్న డబ్బు దాచుకోవడానికి ప్రత్యే క విమానాల్లో తిరుగుతున్నారని వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కేవీ శివయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే వంశీపై 11 కేసులు కట్టారని, మైనింగ్, రెవెన్యూ అధికారులను ఎందుకు సస్పెండ్ చేయలేదన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు ప్రజలను మోసం చేశారన్నారు. ఏడాది కాలంలో లక్ష 51వేల కోట్లు అప్పు చేశారని, సంక్రాంతి లోపు రోడ్లు పూర్తి చేస్తామని చెప్పారని, ఆ రోడ్ల మీద తిరిగితే నడుములు నొప్పులు వస్తున్నాయని తెలిపారు. పనులు పూర్తయిన బిల్లులు ఇంకా రాలేదన్నారు. పథకాలు అడిగితే ఖజానా ఖాళీగా ఉందని చెబు తున్నారన్నారు. లక్ష కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన కూటమి ప్రభుత్వం దిగిపోవాలన్నారు. వైసీపీ నాయకులు జె.గురునాధం, మాదు శివరా మకృష్ణ, ఎంపీపీలు వై.నగేష్, చెన్ను ప్రసన్నకుమారి, జడ్పీటీసీలు ఏఈ రాణి, కె.సువర్ణరాజు, నీలం ప్రవీణ్‌కుమార్, శీలం రంగారావు, వింతా శంకర్‌రెడ్డి, గొసుల శివభరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గన్నవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పేర్నినాని, నాయకులు

విద్యార్థికి ప్రోత్సాహక నగదు బహుమతి

పెనమలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో పోరంకి ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థి ఒరుసు అఖిల్‌కు టీడీపీ యువ నేత బోడె వెంకట్రామ్ ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం విద్యార్థి తల్లిదండ్రులకు అభినందనలు తెలుపుతూ రూ.20 వేలు ప్రోత్సాహక బహుమతిగా అందించి, తదుపరి చదువులకు ఈ మొత్తాన్ని వినియోగించమని సూచించారు.



మెరిట్ విద్యార్థికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే తనయుడు బోడె వెంకట్రామ్

ఉయ్యూరు : జేఈఈ అడ్వాన్స్ 2025లో మంచి ర్యాంకు సాధించిన ఉయ్యూరుకు చెందిన తుమ్మలచర్ల హారికకు ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 20వేల ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. కళాశాల మైదానంలో బుధవారం అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హారికకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పి అభినందించారు. జేఈఈ అడ్వాన్స్‌లో మంచి ర్యాంకు సాధించడం ఉయ్యూరుకే గర్వకారణమని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో ఉన్నత విద్యనభ్యసించి పేరు ప్రఖ్యాతులు గడించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని అధ్యక్షుడు సత్తార్, బాపిరాజు, నాగిన్, సలీమ్ ఇతర సభ్యులు ఆకాంక్షించారు.



హారికకు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేస్తున్న వాకర్స్ అసోసియేషన్



గండిగుంట- పొట్లపాడు రోడ్డులో నరికివేసిన వృక్షాలు

గండిగుంటలో వృక్ష విలాపం!

● విచక్షణా రహితంగా చెట్ల నరికివేత

ఉయ్యూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గండిగుంట- పొట్లపాడు రోడ్డులో పచ్చగా పెరుగుతున్న చెట్లను విచక్షణా రహితంగా నరికి మోడుచేశారు. ఉపాధిహామీ పథకం మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు పెరుగుతూ చల్లని నీడనిస్తున్న చెట్లను విద్యుత్ లైన్లు కింద ఉన్నాయన్న వంకతో అడ్డుగా ఉన్న కొమ్మలు కాకుండా మొదలకంటూ నరికి మోడు చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రోడ్డుకు ఇరు వైపులా నాటి నీరు పోసి పెంచిన మొక్కలు పెరిగి పెద్దవైన పరిస్థితుల్లో నరికి మోడు చేయడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో వ్యవసాయ పనులకు వెళ్లిన వారికి నీడనిస్తూ ఎండవేడిలో సేదతీర్చుకునేందుకు ఉపయోగపడుతున్న చెట్లను నరికి వేయడం ఏమిటని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల్లో అంతర్గత నైపుణ్యాన్ని పెంచడమే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందిస్తూ అంతర్గత నైపుణ్యాన్ని వెలికితీసి ప్రోత్సహించడమే వేసవి శిక్షణ శిబిర లక్ష్యమని గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి, సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. వీరవల్లి గ్రంథాలయ ఆవరణలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం స్వర్ణాంధ్రప్రదేశ్ 2047పై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

ఉయ్యూరు: ఉయ్యూరు గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అనే అంశంపై చిత్ర లేఖనం, అమరావతి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం సాత్విక్ యోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా గురువు జి.కృష్ణ విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు.



ఉయ్యూరు గ్రంథాలయంలో యోగాసానాలు

సంపద షెడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హనుమాన్‌జంక్షన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'సంపదకు చిల్లులు' కథనంపై డీపీవో జె అరుణ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వివరణ కోరారు. సంపద కేంద్రం పైకప్పు చిల్లులు పడి వర్షం నీరు వర్మీ కంపోస్టు తయారు చేసే తొట్టెల్లోకి చేరడంతో ఇబ్బందిగా మారుతోందని కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీపీవో వెంటనే షెడ్డు పైకప్పును తారుషీటుతో కప్పి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీ అధికారులు సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని, సమస్య వచ్చిన వెంటనే చర్యలు చేపట్టి పరిష్కరించాలని ఆదేశించారు. ఆమె ఆదేశంతో సంపద కేంద్రంపై పైకప్పుకు మర్మమతులు చేపట్టనున్నట్టు కార్యదర్శి పూర్ణేశ్వరి తెలిపారు.

పెంచిన ఇళ్ల పన్నుల రికార్డుల పరిశీలన

హనుమాన్‌జంక్షన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : బాపులపాడు గ్రామ పంచాయతీలో 2013-14 ఆర్థిక సంవత్సరంలో పెంచిన ఇళ్ల పన్నులపై నాలుగు బృందాలు విచారణ చేపట్టాయి. జనసేన నాయకుడు చలమలశెట్టి రమేశ్‌బాబు పెంచిన ఇళ్ల పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ ఇటీవల పంచా యతీ కార్యాలయాన్ని సందర్శించి విచారించారు బాధితుల నుంచి వినతిపత్రం స్వీకరించి పెరిగిన ఇళ్ల పన్నులపై నివేదిక తయారు చేయించి ఉన్నతాధికారులకు పంపించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా బాపులపాడు డిప్యూటీ ఎంపీడీవో కె.లక్ష్మయ్య పర్యవేక్షణలో నాలుగు బృందాలను నియమించారు. 2013-14లో పెంచిన ఇళ్ల పన్నులకు సంబంధించిన రికార్డులు పరిశీలన చేస్తున్నారు. దాదాపు 3,750 ఇళ్ల పన్నులకు సంబంధించిన రికార్డులను పరిశీలన చేపట్టారు.



ఇక ఈజీ ఎఫ్ఐఆర్

ఆంధ్రజ్యోతి-విజయవాడ


- కమిషనరేట్‌లో కొత్తగా ఏఐ సాఫ్ట్‌వేర్ టూల్
- ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న పోలీసులు
- ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లు, రిమాండ్ రిపోర్టులు చేత్తో రాయకుండా ఉండేందుకే..
- తొలుత బాధితుడి వివరాలు రికార్డు
- ఆ తర్వాత దానంతట అదే ఫిర్యాదు తయారీ
- ఎఫ్ఐఆర్‌ను కూడా చకచకా పూర్తిచేసేస్తుంది

ఫిర్యాదు ఇలా:

ఏదైనా ఒక విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలంటే ముందుగా పీఎస్‌లోని రిసెప్షన్‌కు వెళ్లాలి. విషయం తెలుసుకుని అక్కడి సిబ్బంది తెల్లకాగితంపై ఫిర్యాదు రాసుకుంటారు. తర్వాత దాన్ని ఇన్‌స్పెక్టర్ వద్దకు తీసుకెళ్తారు.

ఎఫ్ఐఆర్ ఇలా :

ఫిర్యాదుదారుడ్ని విచారణ చేశాక ఎఫ్ఐఆర్ నమోదు చేయాలా వద్దా అనే నిర్ణయం తీసుకుంటారు. ఎఫ్ఐఆర్ కాపీలో ఉన్న 15 కాలమ్‌లను చేత్తో పూర్తిచేస్తారు. కొన్నిసార్లు కంప్యూటర్‌లో టైపు చేస్తారు. తర్వాత ఫిర్యాదుదారుడి వాంగ్మూలం రాసుకుంటారు. ఆ తర్వాత సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసుకుంటారు.ఎఫ్ఐఆర్‌లో బాధితుడి పేరు, తండ్రి పేరు, కులం, చిరునామా, నేరం జరిగిన ప్రదేశం స్టేషన్‌కు ఎంత దూరంలో ఉంది, ఆ ప్రదేశంలో ఏ దిక్కున ఉంది, బాధితులు ఫిర్యాదును ఏ రూపంలో ఇచ్చాడు, జరిగిన నేరానికి ఏ చట్టంలో ఏయే సెక్షన్లు వర్తిసాయి, నిందితుల పేర్లు, పుట్టిన తేదీలు, సమయం, వారి ఎత్తు, ఫిర్యాదులోని సారాంశం, కేసు దర్యాప్తు అధికారి పేరు ఇలా మొత్తం రెండు పేజీల్లో ఉండే 15 కాలమ్‌లను పోలీసులు పూర్తి చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక బాధితులను విచారణ చేసి సీఆర్పీసీ 161 ప్రకారం వాంగ్మూలం నమోదు చేస్తారు. తర్వాత ఘటన జరిగినప్పుడు చూసిన సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసుకుంటారు. దీన్ని పోలీసు పరిభాషలో పార్ట్2గా వ్యవహరిస్తారు.



రిమాండ్ రిపోర్టు ఇలా :

నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తీసుకెళ్లినప్పుడు సీడీ (కేసు డైరీ)తో పాటు రిమాండ్ రిపోర్టును అందజేస్తారు. ఈ రిపోర్టును కంప్యూటర్‌లో టైపు చేస్తారు.

ఏఐ టూల్‌తో ఇలా.. :

పైన పేర్కొన్న పనులన్నీ ఏఐ టూల్ ద్వారా చేయించాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. అందుకనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయిస్తున్నారు. ఇక నుంచి స్టేషన్‌కు వచ్చిన బాధితులను వెబ్ కెమెరా ఉన్న కంప్యూటర్ ముందు కూర్చోబెడతారు. అక్కడ ఉండే సిబ్బంది బాధితులను ప్రశ్నిస్తారు. వారు చెప్పే మాటలన్నీ కంప్యూటర్‌లోని సాఫ్ట్‌వేర్ రికార్డు చేసుకుంటుంది. వారు చెప్పేదంతా వీడియో రికార్డు అవుతుంది. బాధితులు చెప్పిన మాటలను బట్టి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఒక ఫిర్యాదును ఈ సాఫ్ట్‌వేర్ తయారు చేసి ఇస్తుంది. ఎఫ్ఐఆర్ నమోదుకు ఎస్‌హెచ్‌వో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాక పోలీసులు బాధితులను మళ్లీ కంప్యూటర్ ముందు కూర్చోబెడతారు. అందులో కాలమ్‌లను బట్టి సిబ్బంది ప్రశ్నలు వేస్తారు. బాధితులు చెప్పే సమాధానాల ప్రకారం ఆ కాలమ్‌ను ఏఐ పూర్తిచేస్తుంది. మొత్తం పని పూర్తయిన తర్వాత ఎఫ్ఐఆర్‌ను ఓకే చేయాలా.. అని అడుగుతుంది. దీనికి సిబ్బంది నెంబరు ఇచ్చి ఓకే చేస్తే ఎఫ్ఐఆర్ తయారవుతుంది.

చట్టాలు.. తీర్పులు సైతం..

ఒక్కో నేరానికి ఒక్కో చట్టం ప్రకారం సెక్షన్లు నమోదు చేస్తారు. ఆయా కేసుల్లో హైకోర్టులు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు ఉంటాయి. ప్రస్తుతం కోర్టులో వివిధ కేసుల్లో వాదనలు జరుగుతున్నప్పుడు న్యాయవాదులు ఈ తీర్పులను ప్రస్తావిస్తున్నారు. ఇలా వెలువడిన కోర్టుల తీర్పులను, వివిధ నేరాలకు సంబంధించి రూపొందించిన చట్టాలను ఏఐ టూల్‌తో అనుసంధానం చేస్తారు. బాధితులు చెప్పిన మొత్తం వాంగ్మూలం విన్న తర్వాత ఏ చట్టంలోని ఏయే సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేయవచ్చన్న విషయాన్ని ఈ టూల్ కంప్యూటర్‌లో చూపిస్తుంది. యూఎస్ కేంద్రంగా పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ కంపెనీ హైదరాబాద్‌లో ఓ శాఖను నిర్వహిస్తోంది. ఏఐ ద్వారా ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసే ప్రాజెక్టును ఈ కంపెనీ తయారు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రయోగాలు జరుగుతున్నాయి. కంపెనీ ప్రతినిధులు బుధవారం పటమట పోలీస్‌స్టేషన్‌లో పలు ప్రయోగాలు చేశారు. కొత్తగా రూపొందించబోయే ఏఐ టూల్‌కు అనుగుణంగా ప్రస్తుతం స్టేషన్లలో ఉన్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు పనిచేస్తాయా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. రెండు, మూడు రోజులు చేసిన తర్వాత లోటుపాట్లను గుర్తించి సరిచేస్తారు. రాబోయే రెండు, మూడు నెలల్లో ఏఐ ఎఫ్ఆర్ఐను అందుబాటులోకి తీసుకురావాలని ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు నిర్ణయించారు.



పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న దళారీ పూలదాసు సుబ్బారావు

పీడీఎస్ బియ్యం రవాణాకు అడ్డుకట్ట

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సివిల్‌సప్లై అధికారులు
- నిందితుడిపై క్రిమినల్, 6 ఏ కింద కేసులు నమోదు
- ఏఎస్‌వో శ్రీనివాస్

కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): 40 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని వ్యానులో తరలిస్తున్న బియ్యం దళారి పూలదాసు సుబ్బారావును సివిల్ సప్లైస్ అధికారి శ్రీనివాస్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కృష్ణలంక పోలీసులకు అప్పగించారు. రాణిగారితోటకు చెందిన దళారి సుబ్బారావు ద్వారకానగర్‌లోని రేషన్ డీలర్ కృష్ణమూర్తి నుంచి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తీసుకొని బ్లాక్ మార్కెట్‌లో కావాల్సిన వారికి విక్రయిస్తుంటాడు. అందిన సమాచారం మేరకు ఏఎస్‌వో శ్రీనివాస్ మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో కృష్ణమూర్తి రేషన్ డిపో నుంచి వ్యానులో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న సుబ్బారావును కృష్ణలంక సర్వీసురోడ్డు-డొంకరోడ్డు మలుపు వద్ద పట్టుకొని వాహనాన్ని తనిఖీ చేయగా 40 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని కనుగొన్నారు. వెంటనే నిందితుడి సహా వాహనాన్ని కృష్ణలంక పోలీసులకు అప్పగించారు. డీలర్ కృష్ణమూర్తి, దళారి సుబ్బారావుపై పోలీసు కేసుతో పాటు 6ఏ కింద కూడా కేసు నమోదు చేస్తున్నట్టు ఏఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

ఓటర్ల అద్భుత తీర్పే కూటమి ప్రభుత్వం

- మంత్రి నాదెండ్ల మనోహర్

రాణిగారితోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు సరిగ్గా ఏడాది క్రితం ఇదేరోజు ఒక అద్భుతమైన తీర్పుతో కూటమికి అధికారాన్ని ఇచ్చారని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఎన్డీయే కూటమి ఏర్పడి ఏడాది పూర్తవడంతో జనసేన ఆధ్వర్యంలో స్క్యూ బ్రిడ్జి వద్ద ఉన్న ఇస్కాన్ టెంపుల్ ఆవరణలో బుధవారం సుపరిపాలన మొదలై ఏడాది అనే కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మనోహర్ మాట్లాడుతూ ఎవరెన్ని ప్రలోభాలు, ఇబ్బందులకు గురిచేసినా దేశానికి ప్రధానమంత్రి మోదీ నాయకత్వం, రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వం అవసరమని గ్రహించిన ప్రజలు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఓటుతో అద్భుతమైన తీర్పు అందించి దుర్మార్గ పాలనకు అంతం పలికారన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొంది ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఎన్డీయే కూటమికి అధికారం ఇచ్చి రాష్ట్ర ప్రజలు అభివృద్ధికి బాటలు వేశారని, కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు, సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కట్‌చేశారు, ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలకే కాదు హెల్మెట్‌కీ కావాలి భద్రత!

- బైక్‌లకు తగిలించిన హెల్మెట్లు మాయం
- నగరంలో వరుస చోరీలు
- రక్షణకు ప్రత్యేక తాళం కొనుగోలు చేస్తున్న వాహనదారులు



ఆంధ్రజ్యోతి - విజయవాడ: నారా చంద్రబాబు నాయుడు కాలనీలో ఓ ప్రైవేటు కార్యాలయం ఉంది. ఇందులో సుమారు 20-30 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారంతా రోడ్డుపక్కన ద్విచక్ర వాహనాలను పెట్టుకుంటారు. కొంతమంది హెల్మెట్లను తమ వాహనాల అద్దాలకు తగిలిస్తే, మరికొంతమంది తమవెంటే కార్యాలయంలోకి తీసుకెళ్తారు. ఒక ఉద్యోగి యథావిధిగా హెల్మెట్‌ను తన వాహన అద్దానికి తగిలించాడు. సాయంత్రం వచ్చి చూసుకునేసరికి హెల్మెట్ కనిపించలేదు. ఎవరిని అడిగినా తెలియదని చెప్పారు. దీంతో హెల్మెట్ దొంగతనానికి గురైందని నిర్ధారించుకుని మరో హెల్మెట్ కొనుక్కున్నాడు. దీన్ని కాపాడుకునేందుకు రూ.150తో ఒక లాక్‌ను కొనుగోలు చేశాడు. కొద్దిరోజుల క్రితం ఓ సాధారణ పౌరుడికి ఎదురైన పరిస్థితి ఇది. బెంజ్‌సర్కిల్‌లో ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. పోలీసులంతా తమ వాహనాలను ఓ పక్కన పెట్టుకుని వాటిపైనే హెల్మెట్లు పెట్టుకున్నారు. హెల్మెట్ లేని వాహనదారులను ఆపి జరిమానాలు విధిస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పూర్తయ్యాక సిబ్బంది అంతా ఇళ్లకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. వాహనాల వద్దకు వెళ్లి తలపై హెల్మెట్ పెట్టుకుందామనేసరికి ఓ ఎస్ఐకి హెల్మెట్ కనిపించలేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానా షాక్ ఇచ్చే పోలీసులకు ఓ దొంగ ఇచ్చిన హెల్మెట్ ఝలక్ ఇది. విజయవాడలో ద్విచక్ర వాహనాలు మాయమవ్వడం సాధారణం. వాటిలో కదలికలను తీసుకొచ్చేసరికి పెట్రోలు మాయం కేసులు పెరిగాయి. ఇప్పుడే రెండే కాదు, వాహనానికి నడిపే వ్యక్తి తలపై ఉండాల్సిన హెల్మెట్లు కూడా అదృశ్యమవుతున్నాయి. వాహనానికి తగిలించి హెల్మెట్ కనిపిస్తే చాలు సెకన్ల వ్యవధిలో మాయం చేస్తున్నారు. ఇప్పటికే వాహనాలు, పెట్రోలు పోతోందన్న ఆందోళనలో ఉన్న వాహనదారులకు ఇప్పుడు కొత్త బెంగ మొదలైంది. బైక్‌కు హెల్మెట్ తగిలించి టీ స్టాల్ వద్ద ఆగినా, కిరణా షాపు ముందు బ్రేక్ వేసినా అది భద్రంగా ఉంటుందా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. దీనికి కారణం నగరంలో ఎడాపెడా హెల్మెట్లు దొంగతనాలే. హైకోర్టు రోడ్డు ప్రమాదాలపై కన్నెర్ర చేసిన తర్వాత పోలీసులు ట్రాఫిక్ నిబంధనల అమలుపై కొరడా ఝళిపించారు. ఇందులో ప్రధానమైనది హెల్మెట్‌ధారణ. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాల్సిందేనన్న నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. ముందుగా ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించినా పెద్దగా మార్పు రాలేదు. దీంతో ఎక్కడికక్కడ 'నో హెల్మెట్ - నో ఎంట్రీ' విధానాన్ని అమలు చేశారు. హెల్మెట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేశారు. హెల్మెట్ కొనుగోలు చేసి తీసుకొచ్చి చూపించిన వారి వాహనాలను మాత్రమే విడుదల చేసిన సందర్భాలున్నాయి.



హెల్మెట్లపై రూ.1000 దెబ్బ

ఎన్‌ఫోర్స్‌మెంట్ దూకుడు పెంచిన ట్రాఫిక్ పోలీసులు దానికి తగ్గట్టుగానే జరిమానాలను పెంపుదల చేశారు. రూ.100 ఉన్న జరిమానాను రూ.1000కి పెంచారు. ఇది వాహనదారుల్లో దడ పుట్టించింది. ప్రతి ఒక్కరూ తలపై హెల్మెట్ పెట్టుకోవడాన్ని ఒక సంస్కృతిగా మార్చుకున్నారు. ఒకవేళ పెట్టుకోకపోయినా వెంట తీసుకెళ్లడాన్ని అలవాటు చేసుకున్నారు. ఇప్పటివరకు హెల్మెట్లను ఎవరు తీస్తారులేనన్న ధీమాతో బైక్‌లపై వదిలేస్తున్నారు. కొద్దినెలలుగా వీటి విషయంలోనూ దొంగలు చేతివాటం చూపిస్తున్నారు. వాహనాలకు తగిలించిన హెల్మెట్లను మాయం చేస్తున్నారు. నగరంలో ఇప్పటి వరకు సుమారుగా 150 - 200 హెల్మెట్లు చోరీ అయినట్టు అంచనా. అయితే ఎక్కడా కేసులు నమోదు కాలేదు. కానీ వాహనదారులే పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హెల్మెట్లకు ప్రత్యేక తాళాలు కొనుగోలు చేస్తున్నారు. హెల్మెట్‌ను బైక్ వెనుక వైపు ఉండే ఇనుప హుక్‌కు తగిలించి తాళం వేస్తున్నారు. తాజాగా చోరీల జాబితాలో హెల్మెట్ చేరడం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

రాజధాని రైతుల ప్లాట్లకు నేడు ఈ-లాటరీ

కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను ఏపీ సీఆర్‌డీఏకి అప్పగించిన రైతులకు రిటర్నబుల్, ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు 2025 జూన్ 5న గురువారం విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్ సమావేశ మందిరంలో ఈ లాటరీ జరుగుతుందని సీఆర్‌డీఏ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లాటరీలో భాగంగా అమరావతిలోని 15 గ్రామాలకు సంబంధించిన 119 మంది రైతులకు 304 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయించడం జరుగుతందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, కురగల్లు 1, 2, నిడమర్రు 1, 2, పెనుమాక గ్రామాల రైతులకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు తుళ్లూరు 1, 2, నెక్కళ్లు, అనంతవరం, రాయపూడి 1, 2, కొండమరాజుపాలెం, శాఖమూరు, వెంకటపాలెం, వెలగపూడి, మందడం 1, 2, పిచ్చుకలపాలెం గ్రామాల రైతులకు ప్లాట్లను కేటాయించేందుకు ఈ లాటరీ నిర్వహించబడుతుందని అధికారులు తెలిపారు. ఆయా గ్రామాలకు సంబంధించిన రైతులు ఈ లాటరీకి హాజరుకావాలని అధికారులు కోరారు.

బీచ్‌లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

- సముద్రం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలి: కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్ ఫెస్టివల్‌లో యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ సూచించారు. బుధవారం రాత్రి కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర రావు బీచ్‌ను సందర్శించారు. బీచ్ వద్ద అగ్నిమాపక వాహనం, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సముద్రం వద్ద ఆడుకునే వారికి ప్రమాదాలు జరగకుండా టైడ్ హై టైడ్‌తో గుంజలు పాతి బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గజ ఈతగాళ్లు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను ఉంచాలన్నారు. క్రీడాకారుల రాకపోకలకు వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. మెప్మా పీడీ సాయిబాబు, ఆర్డీవో స్వాతి, డీఎస్‌డీవో ఝాన్సీలక్ష్మి, తహసీల్దార్ హరనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ పాల్గొన్నారు.

యువతకు ఆసరాగా జిల్లా గ్రంథాలయ సంస్థ

- పోటీ పరీక్షలకు వెళ్లే యువతకు ఎంతో ఉపయోగం
- ఒక ఉద్యోగి నుంచి ఎస్ఎంఎస్‌లు వస్తున్నాయంటూ యువతుల ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ ఆసరా ఇస్తోంది. దాదాపు 60 మంది యువత ఈ గ్రంథాలయంలో ప్రిపేర్ అవుతున్నారు. అయితే అక్కడ పనిచేస్తున్న ఒక ఉద్యోగి కొందరు యువతులకు ఎస్ఎంఎస్‌లు పంపుతున్నారని ఫిర్యాదులందాయి. ఇవి ప్రజాప్రతినిధుల వరకూ వెళ్లాయి. ఇటీవల జేసీ గీతాంజలి శర్మ వచ్చినప్పుడు గంజాయి బ్యాచ్ యువకులు లైబ్రరీలో తిరుగుతున్నారని, గంజాయి సేవించిన ఓ యువకుడు మహిళల బాత్‌రూమ్‌లోకి వెళ్లిన సందర్భాన్ని జేసీకి తెలిపారు. అయినా సీసీ కెమెరాలు పెట్టలేదు. లైబ్రరీ వద్ద ఒక పోలీసు పికెట్ పెట్టాలని, ఎస్ఎంఎస్‌లు పంపేవారిపై చర్యలు తీసుకోవాలని ఆ యువతులు కోరుతున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఒక కోణంలో విద్యార్థులకు మేలు జరుగుతుంటే మరో కోణంలో ఎస్ఎంఎస్‌ల వేధింపులు వినబడుతున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో హరితవనాల విస్తరణకు కృషి

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం: కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల, గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో నిర్వహించాలని, జిల్లాలో హరిత విస్తీర్ణం పెంపునకు అధికారులు కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే పూర్తయిన పంట కుంటల వద్ద మొక్కలు నాటాలని, బండ్ ప్లాంటేషన్ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 2025-26కు గాను 80 లక్షల ఉపాధి పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 25.76 లక్షల పనిదినాలు పూర్తయ్యాయన్నారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ వరకు 3వేల పంట కుంటలు లక్ష్యంగా కాగా ఇప్పటికి 753 పూర్తికాగా మిగిలిన వాటి పూర్తికి కృషిచేయాలన్నారు. 2025-26లో ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉద్యాన పంటలు చేపట్టేందుకు ప్రతి గ్రామపంచాయతీకి 20 ఎకరాలు, జిల్లాలో 4 వేల ఎకరాల లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1,888 ఎకరాలను గుర్తించామన్నారు. డ్వామా పీడీ ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి హాజరయ్యారు. డివిజన్, మండల స్థాయి అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

మీ ఆలోచనలు పంచుకోండి

రాష్ట్రంలో జనాభా సమతుల్యత లక్ష్యంగా జనాభా నిర్వహణ విధానం (పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ)పై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, విధాన రూపకల్పనలో ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి 9 ప్రశ్నలకు తమ అభిప్రాయాలను ఈనెల 20లోగా పంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో వేగంగా మారుతున్న జనాభా మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించే యోచనలో ఉన్నట్లు వివరించారు. ప్రజలు తమ అభిప్రాయాలను పంచుకొని, రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

క్యూఆర్ కోడ్

యోగాతోనే రోగరహిత జీవితం

సత్యనారాయణపురం: యోగాతోనే రోగరహిత జీవితం సాధ్యమని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో ఆయూష్ శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ ఆధ్వర్యంలో యోగాంధ్రలో భాగంగా బుధవారం సైనికోద్యోగులు, పెన్షనర్లతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో శరీరంలో నూతన శక్తి వస్తుందన్నారు. అనంతరం జిల్లా ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లాసైనికసంక్షేమ అధికారి లెఫ్టినెంట్ కమాండర్ కే కల్యాణ్‌వీణ, మాజీ సైనికులు, సీఐ టి.ధనుంజయనాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, కాలుష్యనియంత్రణ ఈఈ పీ శ్రీనివాస్, డాక్టర్ వీ రాణి పాల్గొన్నారు.

పశ్చిమలో పోటాపోటీ ఆందోళనలు

- రాష్ట్రం నుంచి జగన్ రెడ్డిని బహిష్కరించాలన్న టీడీపీ నేత బుద్దా వెంకన్న
- కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయలేదన్న మాజీ మంత్రి వెలంపల్లి
- తహసీల్దార్ ఇంతియాజ్ పాషాకు వేర్వేరుగా వినతి పత్రాలు




తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బుద్దా వెంకన్న, వెలంపల్లి శ్రీనివాస్

విద్యాధరపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పశ్చిమ నియోజకవర్గంలోని 4వ డివిజన్ అధికార కూటమి నేతలు, విపక్ష వైసీపీ నేతలు పోటాపోటీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లను నగరం నుంచి బహిష్కరించినట్టు జగన్మోహన్ రెడ్డిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. అయిదేళ్ల జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనపై బుధవారం భవానీపురంలో 40వ డివిజన్ అధ్యక్షుడు పీవీ చిన సుబ్బయ్య ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి విజయవాడ పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న బుద్దా వెంకన్న మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడేలా వ్యవహరించేవాళ్లకు రాష్ట్రంలో చోటు లేదన్నారు. పక్క రాష్ట్రాల్లో ఆస్తులున్న జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు పడిలేచిన కెరటమన్నారు. ఓడినా, గెలిచినా చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. దేశంలో మోదీని, రాష్ట్రంలో చంద్రబాబును ఎవరూ ఓడించలేరన్నారు. అనంతరం నేతలతో కలిసి అయిదేళ్లలో జగన్ రెడ్డి హయాంలో జరిగిన అరాచక పాలనపై విచారణ చేయాలని తహసీల్దార్ ఇంతియాజ్ పాషాకు వినతి పత్రం అందజేశారు. కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్లు కొట్టేటి హనుమంతరావు, గుండారపు హరిబాబు, పార్టీ నేతలు కామ దేవరాజు, కె.శివశర్మ, వేమూరి మల్లికార్జున చౌదరి, నందకుమారి పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో..

ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని మాజీ మంత్రి, వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైసీపీ అధిష్టానం పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పశ్చిమలోని 40వ డివిజన్ పరిధి, ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని వైఎస్ విగ్రహం వద్ద నుంచి పున్నమి హోటల్ ఎదురుగా ఉన్న పశ్చిమ తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వైసీపీ నేత వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రూ.లక్షా 50వేల కోట్ల అప్పు చేశారన్నారు. అధికారంలో ఉన్న టీడీపీ నేతలు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. అనంతరం తహసీల్దార్ ఇంతియాజ్ పాషాకు వినతిపత్రం ఇచ్చారు. కార్పొరేటర్లు బండి సుశీల, మండేపూడి చటర్జీ, వై.ఆంజనేయ రెడ్డి, షేక్ రహమ్ తున్నీసా, ఎండీ ఇర్ఫాన్, భూపతి కోటిరెడ్డి, శీరంశెట్టి పూర్ణచంద్రరావు, ఎలకల చలపతి రావు, పార్టీ నేతలు షేక్ ఆసీఫ్, కె.రాంబాబు, పొదిలి చంటిబాబు, పి.శరత్ పాల్గొన్నారు.

భానుడి భగ భగలు

పమిడిముక్కల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రోహిణీ కార్తె ప్రభావంతో కాస్తున్న ఎండలకు ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం నుంచి సాయం త్రం వరకు మండుతున్న ఎండలకు గ్రామాలలో సైతం ప్రజలు ఇళ్లువదిలి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డు జనసంచారం లేక నిర్మానుష్యంగా కన్పించాయి. మూడురోజులుగా భానుడి ప్రతాపంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. రోహిణీ కార్తె ప్రభావం వల్ల ఎండలు, ఉష్ణోగ్రత పెరగడంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు



మంటాడలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

సుస్థిరపాలన కూటమితోనే సాధ్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుస్థిరపాలన, సమగ్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలను నేరవేర్చుతున్న కూటమి ప్రభుత్వం వైఖరిని తట్టుకోలేక ఒక్క ఛాన్సు అంటూ గడిచిన ఐదేళ్ల కాలం పాలించిన మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని విమర్శించారు. వెన్ను పోటు కార్యక్రమం నిర్వహించే అర్హత జగన్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని కులగొట్టిన జగన్ రెడ్డి జైలుకు పోవడం ఖాయమన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత గ్యాస్ వంటి సంక్షేమ పథకాలను కూటమి అమలోస్తుందన్నారు. పామర్రు నియోజకవర్గంలో 490సీసీ రోడ్ల నిర్మాణంతోపాటుగా రూ.12కోట్ల నిధులతో ఆర్‌అండ్‌బీ రహదారులు నిర్మించామన్నారు.



వర్ల కుమార్‌రాజా

సుపరిపాలన అందించడమే కూటమి లక్ష్యం

● జనసేన పామర్రు ఇన్‌చార్జి నరేష్



పామర్రులో ముగ్గుల పోటీలను తాడిశెట్టి నరేష్

పామర్రు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి లక్ష్యమని పామర్రు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పేర్కొన్నారు. జనసేన కేంద్ర కమిటీ పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రమైన పామర్రులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో బుధవారం సుపరిపాలనకు ఏడాది పండుగ చేసుకుందాం అనే కార్యక్రమాన్నినిర్వహించారు. దీనిలో భాగం గా మహిళలకు వివిధ రకాల ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. ముగ్గుల పోటీలకు జిల్లా జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా అనందోత్సవాలతో సుపరిపాలనకు ఏడాది ఉత్సవం చేపట్టినట్లు తెలియజేశారు. ముగ్గుల పోటీల్లో విజేతలైన మహిళలకు ప్రథమ బహుమతి ఐదువేలు, ద్వితీయ బహుమతి మూడువేలు, తృతీయ బహుమతి రెండు వేలు చొప్పున బహుమతులందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ బందరు కార్పొరేటర్ నాగఛాయాదేవి పాల్గొన్నారు.

గుడివాడ : జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు బుధవారం స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జనసేన వీరమహిళలు, తెలుగు మహిళలు రంగవల్లులద్దారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు స్థానిక అంజనేయపేటలోని జనసేన నాయకులు సందు పవన్ కార్యాలయంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, సిరిపురపు తులసీరాణి, వీరమాచినేని శైలజ, మల్లికా బేగం పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : రాష్ట్రప్రజలు కూటమి ప్రభుత్వానికి చారిత్రిక విజయాన్ని కట్టబెట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలను గుడ్లవల్లేరు పాథమిక ఆరోగ్యకేంద్రానికి స్థానిక నాయకుల చేతుల మీదుగా బుధవారం బహుకరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి,ఉపముఖ్యమంత్రి చిత్రపటాలు ఉంచాలని నిబంధనలు ఉన్నా ఏడాదిగా గుడ్లవల్లేరు పీహెచ్‌సీ సెంటర్లలో వారి చిత్ర పటాలు ఏర్పాటు చేయలేదు. కూరాడ గ్రామానికి చెందిన వ్యాపారి పెరుమాళ్లు దాతృత్వంతో ఏర్పాటు చేశారు. ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వరరావు, టీడీపీ నేత వెంకటరావుల చేతులమీదుగా డాక్టర్ యశస్వికి ఆస్పత్రిలోని రెండు ఓపి వైద్యుల గదుల్లో ఏర్పాటు చేసేందుకు నాలుగు ఫోటో ఫ్రేమ్‌లను అందజేశారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న పవన్

స్థలం అమ్ముతామని మోసం చేసిన వారిపై కేసు నమోదు

గుడివాడ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థలం అమ్ముతామని మోసం చేసిన వారిపై కేసు నమోదు చేసిన ఘటన గుడివాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల సైదేపూడి గ్రామ నివాసి ధనికొండ రాంబాబు అనే వ్యక్తికి గతేడాది సెప్టెంబర్ నెలలో గుడివాడ మండలం వలివర్తిపాడు రోడ్డులో గల 76.5 గజాల ఇంటి స్థలం , అందులో గల రేకుల షెడ్ కలిపి అమ్ముతామని చెప్పి గుడివాడకి చెందిన గడ్డం కిశోర్, అతని భార్య బొకినాల బుజ్జి, మధ్యవర్తులైన నాగేశ్వరరావు, విజయ్‌లు పలు దఫాలుగా స్టాంప్ డ్యూటీతో సహా మొత్తం రూ.12,42,000లు కట్టించుకున్నారు. అతనికి స్థలం రిజిస్ట్రేషన్ చేయలేదు. డబ్బు తిరిగి ఇవ్వకుండా మోసం చేశారు. దీంతో ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గుడివాడకి చెందిన గడ్డం కిశోర్, అతని భార్య బొకినాల బుజ్జి, మధ్యవర్తులైన నాగేశ్వరరావు, విజయ్ అనే వారిపై కేసు నమోదు చేసినట్లు గుడివాడ రూరల్ ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు.

టాపుల నుంచి కలుషిత నీరు

పెదపారుపూడి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కలుషితం నీరు దుర్వాసన రావటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని పొడుగుమాటి సువర్ణరాజు అన్నారు. మంగళవారం పెదపారుపూడిలో టాపుల ద్వారా సాయంత్రం కలుషిత నీరు రావటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నీళ్ల దుర్వాసన రావటంతో టాపుల ద్వారా తాగునీరు కలుషితమై ఆరోగ్యాలు పాడవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలుతీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన తప్పనిసరి

● కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి

కూచిపూడి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భూమికి అనువైన వరి వంగడాలను రైతులు ఎంపిక చేసుకోవటంతోపాటు యాజమాన్య పద్ధతులు పాటించినట్లైతే అధిక దిగుబడులు సాధించవచ్చునని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి పేర్కొన్నారు.వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఖరీఫ్ సాగులో నూతన వరి వంగడాలు - యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తల బృందం కూచిపూడిలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయిల్ ఫామ్ సాగు గురించి శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బన్న రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కె.శివ ప్రసాద్ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాలు, రాయితీల గురించి వివరించారు. ఉద్యానవన శాఖ అధికారిణి కీర్తి, గ్రామసర్పంచ్ కొండవీటి విజయలక్ష్మీ, శాస్త్రవేత్త కృష్ణవేణి, వివిధ గ్రామాలకు చెందిన రైతులు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

మురుగునీటి శుద్ధి యంత్రాల పరిశీలన

గుడివాడ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండల పరిధిలోని సెరివేల్పూరు నుంచి మురుగు నీటిని శుద్ధి చేసే యంత్రాల పని బాగుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.ఉర్మిళ దేవి అన్నారు. బుధవారం సెరివేల్పూరులో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం, మురుగు నీటిని శుద్ధి చేసే యంత్రాలను కేంద్ర బృంద సభ్యులతో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగునీరు యంత్రాలకు సరిపోనూ రావటం లేదని, ఇంకా ఎక్కువగా రావాలని తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ సెరివేల్పూరు చిన్న గ్రామమని, వేసవిలో తక్కువ నీరు వస్తుందని తెలిపారు. గ్రామానికి నిధులు మంజూరు చేయాలని ఆమెను కోరగా, నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. అనంతరం సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించి ఇంకా మెరుగుపర్చాలని తెలిపారు. గ్రామం చిన్నది కావటంతో అన్ని రకాలుగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని ఈవోపీఆర్‌డీ తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారు తెలిపారు. గ్రామ సర్పంచ్ మేడేపల్లి ప్రభాకర్‌రావు, పాల్గొన్నారు.



సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

గుడివాడ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం ప్రతి గ్రామ పంచాయతీలో 150 నుంచి 200 మొక్కలు నాటాలని తెలిపారు. ప్రధాన రహదారుల వెంట చక్కటి మొక్కలు నాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం నుంచే మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

పమిడిముక్కల : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పమిడిముక్కల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంగన్వాడీ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామప్రజలు పోటీల్లో పాల్గొని రంగవల్లులు తీర్చి దిద్దారు.

రక్తదానంతో ప్రాణాన్ని రక్షించొచ్చు

●ఎంపీడీవో టి.విజయసారథి

గుడ్లవల్లేరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ప్రాణాన్ని రక్షించవచ్చని గుడ్లవల్లేరు ఎంపీడీవో టి.విజయసారథి అన్నారు. స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ కృష్ణాజిల్లా శాఖ,లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు సంయుక్త ఆధ్వర్యంలో మచిలీపట్నం డాక్టర్ పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారిచే బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది, ఆర్ఐ హనుమంతరావు, ఎస్ఏ పి.శివకుమార్, వీఆర్‌వోలు, గుడ్లవల్లేరు వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది 40 మంది వరకూ రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ టీఎస్ఎస్ బాలాజీ, సెక్రటరీ భవిరి శంకర్‌నాథ్, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శశికళ, కార్యదర్శి పెరుమాళ్లు, పరందామయ్య, పి.వెంకటరావు, సీహెచ్ రాజా, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

గోవులను, ఒంటెలను బలి ఇవ్వొద్దు

● ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు ఎటువంటి గోవులను, ఒంటెలను వధ చేయొద్దని రెవెన్యూ డివిజనల్ అధికారి జి.బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని వివిధ మసీదు కమిటీల పెద్దలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వపరంగా మసీదుల వద్ద చేయబోయే ఏర్పాట్ల గురించి చర్చించారు. జంతుహింస నివారణ చట్టం-1960, రాష్ట్ర గోవధ నిషేధం, పశు సంరక్షణ చట్టం-1977 ప్రకారం కలెక్టర్ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, సీఐ చల్లా నాగప్రసాద్, మసీదు కమిటీల పెద్దలు షేక్ బాజీ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

గుడివాడ, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక బైపాస్‌రోడ్డులోని మమతా వృద్ధాశ్రమంలో శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ మారెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి సహకారంతో బుధవారం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మండల వ్యవసాయ శాఖ అధికారి బి.అనంతలక్ష్మీ పాల్గొని పంపిణీ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్, కోటేశ్వరరావు, శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పల్లపోతు వెంకటనాగబాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న వెనిగండ్ల

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

గుడివాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 6 నుంచి 11 వరకు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల స్వగృహంలో వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను బుధవారం ఎమ్మెల్యే అవిష్కరించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు ఎమ్మెల్యేకు చిరుసత్కారం చేసి స్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాలరావు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుకు ఆహ్వానపత్రికలను అందజేసి స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

ఓవర్‌లోడు టిప్పర్లతో రోడ్లు ధ్వంసం

పమిడిముక్కల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో క్వారీల నుంచి ఇసుక ఓవర్‌లోడుతో వస్తున్న టిప్పర్లతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. లంకపల్లి వైపు నుంచి బాడీకిపైకంటూ ఇసుక నింపుకుని పెద్ద టి ప్పర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. బాడీతో పాటు క్యాబిన్ పైవరకు నింపుకుని వస్తున్న టిప్పర్ల నుంచి జారి పడిన ఇసుక రోడ్డుపై వెల్లేవారి మీద పడుతుంది. పరిమితికి మించి ఓవర్‌లోడుతో పదుల సంఖ్యలో పగలనక రాత్రనక టిప్పర్లు యథేచ్ఛగా తిరుగుతున్నా రవాణాశాఖ, పోలీసులు ఎవరూ పట్టించుకోపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గుడివాడ రూరల్ , జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చౌటపల్లి గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, డ్రాయింగ్, క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జి.రత్న చంద్ పాల్గొన్నారు.

పెదపారుపూడి: వేసవి శిక్షణా తరగతులలో భాగంగా బుధవారం పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం మీద పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్ఫూర్తివంతమైన చిత్రాలను గీయటం చూపరులకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. అనంతరం తెనాలి రామకృష్ణ కథ చార్టుపై రాసి అర్థవంతంగా ప్రదర్శించి కథను వివరించారని గ్రంథాలయ అధికారిణి ఎంవీఎస్.లక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు , గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన టీడీపీ శ్రేణులు

నందివాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మార్కెట్‌యార్డు ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా నందిగామ మండల తెలుగుదేశం పార్టీ నాయకుడు చాట్రగడ్డ రవి, ఎమ్మెల్యేరాము ఎంపిక చేయటంతో బుధవారం చాట్రగడ్డ రవి ప్రమాణస్వీకార మహోత్సవమును మండలంలోని పలు గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా జనార్ధనపురం తెలుగుదేశం నాయకులు కొండపల్లి రాఘవరెడ్డి, అరిపిరా, జనసేన గుళ్లపల్లి రమాదేవి, తమిరిశ వెంకటరమణ అనుమనపూడి, సూరిపనేని ప్రదీస్, నందివాడ వీర్ల విజయలక్ష్మి, మెంబర్లుగాను ఎంపిక కావటంతో మండల గ్రామాల ప్రజలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా జనార్ధనపురం సెంటర్‌లో వెనిగండ్ల రాముకు, మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికి కొండపల్లి రాఘవరెడ్డికి భారీ గజమాల వేసి వెనిగండ్లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రవి

డిగ్రీలో ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించాలి : ఎస్ఎఫ్ఐ

గుడివాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టిన డ్యూయల్ డిగ్రీ విధానంలో ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు తీవ్ర భారంగా మారిందని, వెంటనే ఇంటర్న్‌షిప్ బారాన్ని తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్యభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఇంటర్న్‌షిప్‌ను అమలేస్తున్నారన్నారు. ఇంటర్న్‌షిప్ పేరుతో రొయ్యల కంపెనీలు, పార్లీ బిస్కెట్, స్విగ్గీ, జోమాటో, డి-మార్ట్, ఫ్లిప్‌కార్టు వంటి అనేక చిన్న పరిశ్రమల్లో పని చేయించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

చంద్రబాబు పాలనలో ప్రజలు తీవ్ర అసంతృప్తి

● మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది పాలనలో ప్రజలందరూ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. చంద్రబాబు ప్రజలను మోసగించిన తీరును నిరసిస్తూ వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని బుధవారం పామర్రులో వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. వైసీపీ శ్రేణులు తహసీల్దార్ కార్యాలయం లోపలికి చొరబడడానికి ప్రయత్నించగా పెద్దఎత్తున పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్ రవి కాంత్‌కు వినతి పత్రం అందజేశారు.

గుడివాడ : ఎన్నికల ప్రచారంలో ఉచితాల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, తాను చెప్పిన సూపర్ సిక్స్‌హామిలను గాలికి వదిలేసి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని వెన్నుపోటు దినం నిరసనల జిల్లా సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక జగన్నాధపురంలోని విడిదిల్లు నుంచి ఆర్‌డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించేందుకు వైసీపీ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అనుమతికి లేకపోడంతో కొందరు నాయకులు ఆర్‌డీవో కార్యాలయానికి వెళ్ళి ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైసీపీ శ్రేణులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

ప్రజా ప్రభుత్వమిది: ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం సుపరిపాలన చేస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం బంటుమిల్లిలో గవర్నమెంట్ ఖాజీ కార్యాలయాన్ని ఆయన ప్రారంబించారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల వారికోసం గవర్నమెంట్ ఖాజీను బంటుమిల్లిలో ఏర్పాటు చేయడం వల్ల ముస్లింలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గవర్నమెంట్ ఖాజీగా మహ్మద్‌ఖాజాకు నియామక పత్రాన్ని అందజేశారు. ముస్లింలకు బీసీ-ఈ సర్టిఫికెట్, వివాహ సర్టిఫికెట్ ఇక్కడ నుంచే పొందొచ్చని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు వీరబాబు, డీసీ చైర్మన్ బొర్రా కాశీ, ముస్లిం పెద్దలు ఎండీ రవూఫ్, నజీర్ అక్బర్, నూర్, అలీబాషా, రెహ్మాన్, షానూర్ పాల్గొన్నారు.

ప్రజాతీర్పును అవహేళన చేస్తూ

వెన్నుపోటు దినోత్సవమా!

● వైసీపీపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆగ్రహం

అవనిగడ్డ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ దుష్టపాలనకు వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పును అవహేళన చేస్తూ వెన్నుపోటు దినోత్సవం నిర్వహించటం సరికాదని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ' వైసీపీ ఐదేళ్ల పాలనలో వాక్స్వాతంత్ర్యం లేకుండా ప్రజలను భయపెట్టి పాలించింది. దాని ఫలితమే ఓటమి. ప్రజాస్వామ్యయుతంగా జరిగే ఏ కార్యక్రమాన్ని అడ్డుకోకూడదన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం వైసీపీ కార్యక్రమానికి ఆంక్షలు పెట్టలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఏ చిన్న కార్యక్రమం జరిగినా పోలీసు కవాతులు, గృహ నిర్బంధాలు పెట్టి ప్రజలను భయపెట్టేవారు. సహజవనరులు దోచుకుని రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు. ఇప్పటికైనా జగన్మోహన్‌రెడ్డి పశ్చాత్తాపం పొందాలి.' అని బుద్ధప్రసాద్ హితవు పలికారు.

జగన్ రాష్ట్రానికి హానికరం: కనపర్తిశ్రీనివాసరావు

మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి హానికరమైన వ్యక్తి అని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. కూటమి విజయోత్సవ ర్యాలీ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'వెన్నుపోటు దినం అంటున్న జగన్మోహన్‌రెడ్డే వెన్నుపోట్లు, గొడ్డలి పోట్లకు బ్రాండ్ అంబాసిడర్. దేశ చరిత్రలో తల్లికి, చెల్లికి వెన్నుపోటు పొడిచిన, బాబాయ్‌ని గొడ్డలి పోటుతో అంతం చేసిన ఏకైక వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి.' అని కనపర్తి ఆరోపించారు.

జగన్‌రెడ్డి పీడ విరగడై ఏడాదైంది

● గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడిన సీఎం జగన్మోహనరెడ్డి పీడ విరగడై ఏడాది పూర్తయిందని, తెలుగువారు ఏడాదిగా సంతోషంగా ఉన్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బుధవారం శిడింబి అగ్రహారంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జూన్ 4న వెన్నుపోటు దినోత్సవంగా వైసీపీ పేటీఎం బ్యాచ్ కరపత్రాలు పంచడం సిగ్గుచేటన్నారు. 2019లో అధికారంలోకి వచ్చాక చెల్లిని పక్కన పెట్టి, తల్లిని ఇంటి నుంచి గెంటిన వెన్నుపోటు నాయకుడు జగన్ అని అందరికీ తెలుసన్నారు. సొంత బాబాయిని గొడ్డలి పోటుకు బలిచ్చిన వెన్నుపోటుదారుడు ఎవరో అందరికీ తెలుసన్నారు. పీవీ ఫణికుమార్, గంజాల రవికుమార్ పాల్గొన్నారు.

వ్యవస్థలకు వెన్నుపోటు పొడిచింది జగనే

● డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగపరుస్తూ విధ్వంసకర పాలన సాగించింది, వ్యవస్థలకు వెన్నుపోటు పొడిచింది మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ ధ్వజమెత్తారు. జనసేన నియోజకవర్గ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. మద్యపాన నిషేధమని చెప్పి కోట్లు దండుకున్న జగన్‌రెడ్డి..గంజాయి బ్యాచ్‌ను పెంచి పోషించారన్నారు. ప్రభుత్వమే స్వయంగా కల్తీ మద్యం అమ్మి ప్రజల ఆరోగ్యాన్ని కొల్లగొట్టిందన్నారు.







పెడనలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, మచిలీపట్నం జనసేన కార్యాలయం వద్ద వేడుక నిర్వహిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, నాయకులు, అవనిగడ్డలో కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ముగ్గులు వేస్తున్న మహిళలు

కూటమి విజయోత్సవాలు

సుపరిపాలనకు ఏడాది పూర్తైందని సంబరాలు

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ/పెడన/చల్లపల్లి/ఘంటసాల/కోడూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతమై కూటమి నేతృత్వంలో సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని అవనిగడ్డలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ కార్యాలయం నుంచి పార్టీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీగా రాజీవ్‌గాంధీ సెంటర్‌కు చేరుకోగా, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో జనసేన నేతలు రాజీవ్‌గాంధీ సెంటర్‌కు చేరుకున్నారు. కూటమి నేతలు కలిసి అక్కడి నుంచి కోర్టు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కోడూరులో మండల కూటమి నేతల ఆధ్వర్యంలో విజయోత్సవం నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో బాణాసంచా కాల్చారు. ఘంటసాల మండలం తాడేపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు పరుచూరి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

అవనిగడ్డలో ముగ్గుల పోటీలు

సుపరిపాలన మొదలై ఏడాది గడిచిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీ క్షేత్రంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సతీమణి మండలి విజయలక్ష్మి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని కూటమి విజయాన్ని ప్రతిబింబించేలా రంగవల్లులతో అలరించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పర్యవేక్షించారు.

రాక్షస పాలన అంతమైన రోజు: ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన బస్టాండ్ సెంటర్‌లోని మహాత్మాగాంధీ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కేకు కట్ చేసి విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ రాక్షస పాలన అంతమై కూటమి ప్రజాస్వామ్య పాలన అమల్లోకి వచ్చిన జూన్ 4వ తేదీ ఎంతో మంచి రోజన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లభించాయన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో జనసేన కార్యాలయం వద్ద..

మచిలీపట్నంలో బండి రామకృష్ణ ఆధ్వర్యంలో విజయోత్సవ ప్రదర్శన నిర్వహించారు. జనసేన నియోజకవర్గ కార్యాలయం ముందు ముగ్గులు వేశారు. దీపాలు వెలిగించి, బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంచారు.



అవనిగడ్డ ప్రధాన సెంటర్‌లో బాణాసంచా కాలుస్తున్న కూటమి నాయకులు

చల్లపల్లిలో..

జనసేన కార్యాలయం వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. కార్యాలయం ఎదురుగా ఉదయం రంగవల్లులు తీర్చిదిద్దారు. సాయంత్రం టపాసులు పేల్చారు. మండలి వెంకట్రామ్ కేక్ కట్‌చేశారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న పాల్గొన్నారు.



అవనిగడ్డలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రమిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు

వైసీపీ భారీ ర్యాలీలు

● హామీలు నెరవేర్చాలంటూ డిమాండ్

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ/పెడన, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడుస్తోందని అవనిగడ్డ, పెడన, మచిలీపట్నంలో వైసీపీ శ్రేణులు భారీ ర్యాలీలతో కదం తొక్కారు. అవనిగడ్డలోని వైసీపీ కార్యాలయం వద్ద నుంచి స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నేతృత్వంలో ఆ పార్టీ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని రమేష్‌బాబు విమర్శించారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. సింహాద్రి వికాస్, సింహాద్రి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పెడనలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము నాయకత్వంలో ఆ పార్టీ కార్యాలయం నుంచి తోటమూల సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. తొలుత గాడెల్లి కల్యాణ మండపం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. పేర్ని కృష్ణమూర్తి, షేక్ సిలార్ దాదా, ఆ పార్టీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.1,01,116 విరాళం

కోడూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కోడూరులో పునర్నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి గ్రామానికి చెందిన అన్నం శేషావతారం కటుంబసభ్యులు రూ.1,01,116 విరాళాన్ని అందించారు. బుధవారం శేషావతారం స్వగృహం వద్దకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు వెళ్లి నగదును అందుకున్నారు. శేషావతారం కుటుంబసభ్యులను సత్కరించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరనాథ్‌బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, బడే భావన్నారాయణ, అన్నం శివరామకృష్ణ పాల్గొన్నారు.

పోర్టు అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● అందుకోసమే బీచ్ ఫెస్టివల్ నిర్వహణ

● కొల్లు ఫౌండేషన్ అధినేత కొల్లు నీలిమ



ఫణికుమార్ దంపతులు చేస్తున్న యజ్ఞం వద్ద కొల్లు ఫౌండేషన్ అధినేత కొల్లు నీలిమ

విజయవాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు ఉపయోగపడే మచిలీపట్నం పోర్టును అభివృద్ధి చేయాలనే సంకల్పంతో బీచ్ ఫెస్టివల్‌ను ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహిస్తోందని కొల్లు ఫౌండేషన్ అధినేత్రి కొల్లు నీలిమ అన్నారు. కొల్లు రవీంద్ర ఆదేశానుసారం బుధవారం బీచ్ వద్ద టీడీపీ 45వ వార్డు ఇన్‌చార్జి పీవీ ఫణికుమార్ దంపతులు పశుపతి హోమా న్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొల్లు నీలిమ విచ్చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం బీచ్‌కు ఒక ప్రత్యేకత తేవడానికి తనవంతు కృషి చేస్తు న్నారన్నారు. వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో మచిలీప ట్నం నియోజకవర్గం అభి వృద్ధికి నోచుకోలేదని, కూటమి ప్రభుత్వంలో మచిలీపట్నానికి, పోర్టుకు అనేక పరిశ్రమలు వస్తాయని, యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా వస్తాయని ఆమె అన్నారు.

బీచ్ ఫెస్టివల్‌కు తరలిరండి

మచిలీపట్నం టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మసూలా బీచ్ ఫెస్టివల్‌కు యువత తరలి రావాలని టీడీపీ నాయకుడు పీవీ ఫణికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం శిడింబి అగ్రహారంలో టీడీపీ నాయకులు మసూ లా బీచ్‌ఫెస్టివల్ ఆహ్వానపత్రికలను పంపిణీ చేశారు.

ఆహ్వానపత్రిక విడుదల

మసూలా బీచ్ ఫెస్టివల్‌కు రైతులు, యువకులు కదలిరావాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. బందరు మండలం కానూరులో బీచ్ ఫెస్టివల్ ఆహ్వానపత్రికను ఆయన విడుదల చేశారు. సినీ కళాకారులు మారుతి, రాజాసాబ్ బృందం, సింగర్ మిరియాల రామ్ బృందం నిర్వహించే నృత్యప్రదర్శనలు, సంగీత విభావరి తిలకించాలని కోరారు.

అనధికార మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోండి

● అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశం



అయోధ్య వెళ్లే డ్రెయిన్‌లో ఉత్తర చిరువోలులంక వద్ద మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉత్తరచిరువోలులంక వద్ద అయోధ్య వెళ్లే డ్రెయినేజీలో అనధికారికంగా జరుగుతున్న మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. బుధవారం గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఉత్తరచిరువోలులంకవద్ద డ్రెయినేజీలో మట్టి తవ్వకాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇక్కడ కొందరు రైతులు తమ చేలలో మెరక తీసుకునే పేరుతో అనుమతులు పొంది ఉత్తర చిరువోలులంక-అయోధ్య మురుగు కాలువలో మట్టిని తవ్వేస్తూ భారీ గోతులు పెట్టారని గ్రామస్థులు తెలిపారు. గతంలో అక్రమంగా డ్రెయినేజీ తవ్వేయడంతో ఏర్పడిన గోతులను ఎమ్మెల్యేకు చూపించారు. పొలిమేర డొంకను గతంలోనే తవ్వేసుకుని మట్టిని తరలించుకుపోవటంతో డొంక రోడ్డు వెడల్పు తగ్గిపోయిందని వివరించారు. పొలిమేర డొంక సర్వే చేయించి రోడ్డు పునరుద్దరణ జరిగేలా చూడాలని విన్నవించారు. పరిస్థితిని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి అక్రమంగా మట్టి తవ్వే వారిపై చర్యలు తీసుకోవాలని వీఆర్వోకు ఎమ్మెల్యే సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, జనసేన మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, మత్స్యకారులు

సముద్ర కాలుష్యాన్ని నివారిద్దాం

కోడూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సముద్ర కాలుష్యాన్ని నివారించడానికి మత్స్యకారులు సహకరించాలని ఫిషరీష్ సర్వే ఆఫ్ ఇండియా హెచ్‌వోడీ సీ.ధనుంజయరావు కోరారు. బుధవారం విశ్వనాథపల్లి కమ్యూనిటీ హాల్‌లో ప్రభుత్వ ఎంవీకేఆర్ మత్స్యకార పాలిటెక్నిక్ కళాశాల, ఫిషరీష్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భారతదేశంలోని సముద్ర మత్స్య వనరులు, సముద్ర కాలుష్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్య సంపద వేటలో ప్రకృతి వనరులు నాశనం కాకుండా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందుబాటులోకి వచ్చిన నూతన విధానాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కొప్పనాతి శేషుబాబు, ఏపీ ఫిషరీష్ యూనివర్సిటీ హెచ్‌వోడీ, రిజిస్ట్రార్ టి.సుగుణ, ఫిషరీష్ సర్వే ఆఫ్ ఇండియా జూనియర్ ఫిషరీష్ సైంటిస్ట్ జీవీఏ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, మెరైన్ ఎస్సై పూర్ణమాధురి, అవనిగడ్డ మత్స్యశాఖ సంచాలకులు ప్రతిభ, కోడూరు మండల ఎస్‌డీవో దావూరి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి రూ.2.12 కోట్ల జడ్పీ నిధులు మంజూరు

పెడన రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు జిల్లా పరిషత్ నుంచి రూ 2.12 కోట్లు మంజూరైనట్టు సీఈవో అనంద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారని ఎండీవో ఎ.అరుణకుమారి తెలిపారు. గ్రామాల్లో ర్యాంప్‌లు, సీసీ రోడ్లతో పాటు చోడవరం, గురివిందగుంట గ్రామాల్లో ఒక్కొక్కదానికి రూ.25 లక్షలు చొప్పున రెండు కమ్యూనిటీ భవన నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. మెత్తం 32 పనులు చేయాల్సి ఉందన్నారు.

ఘనంగా పృథ్వీశ్వర ఆలయ రాజగోపుర వార్షికోత్సవాలు



దేవతామూర్తులకు అభిషేకం చేస్తున్న మండవ రవీంద్ర దంపతులు, భక్తులు

చల్లపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నడకుదురు పృథ్వీశ్వర ఆలయ రాజగోపుర తృతీయ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ సమగ్ర అభివృద్ధి దాత మండవ రవీంద్ర-రమణకుమారి దంపతులతో పూజా కార్యక్రమాలు జరిగాయి. పాటలీవనంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాల నమూనా దేవతామూర్తులకు, పరివార దేవతలకు మండవ రవీంద్ర దంపతులు, భక్తులు అభిషేకాలు నిర్వహించారు. గర్భాలయంలోని మూలవిరాట్ స్వయంభూ పృథ్వీశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు కంఠంరాజు సాయిబాబు శర్మ (గణపతి దీక్షితులు) ఆధ్వర్యంలో వేదపండితులు, పురోహితులు, అర్చకులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం కలశాభిషేకం, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు జరుగనుండగా, ద్విసహస్రావధాని, పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీపృథ్వీశ్వరక్షేత్రం వైభవంపై ఉపన్యసిస్తారు.

ఎర్రజెండా లక్ష్యాన్ని

కొనసాగించాలి

● సీపీఐ రాష్ట్ర నేత కేవీవీ ప్రసాద్

చల్లపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఎర్రజెండా లక్ష్యాన్ని కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర నేత కేవీవీ ప్రసాద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వక్కలగడ్డ సీపీఐ గ్రామశాఖ సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం సాయంత్రం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ, ఏ ఆశయం కోసం అయితే వక్కలగడ్డలో పెద్దలు కమ్యూనిస్టు శాఖ ఏర్పాటుచేశారో అదే ఆశయంతో నేటితరం యువత ముందుకు సాగాలని కోరారు. ఎంతో ఘనచరిత్ర కలిగిన దివితాలూకా కమ్యూనిస్టు పార్టీలో వక్కలగడ్డ స్థానానికి ప్రత్యేకత ఉందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతుసంఘం రాష్ట్రనేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గ్రామ శాఖ కార్యదర్శి నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యదర్శిగా నక్కా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మునిసిపాలిటీలో వైసీపీ నేతల భారీ అవినీతి

● ప్రభుత్వానికి నివేదికలు పంపుతాం: టీడీపీ

పెడన, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధీనంలో ఉన్న పెడన మునిసిపాలిటీలో నాలుగున్నరేళ్లలో భారీగా అవినీతి జరిగిందని టీడీపీ నాయకులు ఆరోపించారు. తోటమూలలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో పట్టణ నాయకులు మాట్లాడారు. వైసీపీ నాయకుల అవినీతిపై నివేదికలు రూపొందించి ఆ నివేదికలు ప్రభుత్వానికి పంపి వారికి శిక్షలు పడేలా చేస్తామని హెచ్చరించారు. వైసీపీ పాలకులు తమ అసమర్థతను చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు కమిషనర్, అధికారులపై నిందలు వేస్తున్నారన్నారు. నిన్న మొన్నటి వరకు అధికారులతో అంటకాగిన వైసీపీ నాయకులు ఇప్పుడు అధికారులు సరిగా పనిచేయడం లేదని తప్పుపట్టడం భావ్యం కాదని తెలిపారు. పరిపాలన చేతకాకపోతే వైసీపీ పాలకులు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. రాజీనామా చేస్తే మునిసిపాలిటీని ఎలా అభివృద్ధి చేయాలో తాము చేసి చూపిస్తామన్నారు. మునిసిపాలిటీల కార్యకలాపాలపై ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, ఆ పార్టీ నాయకులు హన్ను, కమ్మగంటి బాబు, పరసా జితేంద్ర, యర్రా నాగరాజు, హమీదుల్లా, అబ్దుల్ ఖదీర్, ఖుర్షిద్ బేగం, తమ్మా బీమయ్య, పరసా సూర్యనారాయణ, బూసం ఆనందరావు, గఫార్ పాల్గొన్నారు.

13న బౌద్ధ స్థూపం వద్ద

యోగా కార్యక్రమం

ఘంటసాల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బౌద్ధ స్థూపం వద్ద ఈనెల 13వ తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలివ చ్చి విజయవంతం చేయాలని తహసీల్దా ర్ బి.విజయప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం బౌద్ధస్థూపం వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కలెక్టర్ డీకే బా లాజీతోపాటు ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగా జరుగుతుందని, మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నేతలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, బౌద్ధ భిక్షువు బంతేజీ, ఆర్ ఐ శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయ ఏవో శ్రీనివాస చందు పాల్గొన్నారు.

వైభవంగా నిర్భయానంద స్వామి ఆరాధనా మహోత్సవాలు

చల్లపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పాగోలు కైవల్యాశ్రమంలో స్వామి నిర్భయానందుల వారి తృతీయ ఆరాధనా మ హోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రభాత సంధ్య, రాజయోగి సుప్రభాతం, మేలుకొలుపులు, మూలవిరాట్టు శ్రీకమలాత్మికా సహిత అచలేశ్వరస్వామికి అభిషేకాలు, నిర్భయానందుల వారి ఆరాధన, గురుపూజ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ట్రస్టీ మేకా బంగారుబాబు..విజయకుమారి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్భయానందస్వామి శిష్య బృందం పాల్గొన్నారు. మధ్యాహ్నం, సాయంత్రం సత్సంగము, సద్గురు బోధ కార్యక్రమాలు ని ర్వహించారు.